
మాస పత్రిక
రి 1993
రూ. 4/-





# The enigma of the Mona Lisa's smile

A subject of dispute for centuries, may have a simple explanation. The face of the unknown sitter, famous for its strangely sinister quality, may be a mirror image of Leonardo himself, according to a psychiatrist in London.

The sinister aspect to the smile, described by Sigmund Freud as expressing the contrast between "the most devoted tenderness and a sensuality that is ruthlessly demanding", arises because of the way we "read" faces with the two halves of our brain, says Dr Digby Quested, a registrar at London's Maudsley hospital.

"There was evidence that he was homosexual and he may have felt trapped in his sexuality", he said. "It may be that people saw him as one thing but he felt he was another and didn't feel free to express it. Painting himself as a female would have helped him"

# మిసిమి

***"All that we are is the product of what we have thought," is "We are what we think." –* Dammapada.**

సంపుటి 4 జనవరి1993 సంచిక 6

సంపాదకుడు: రవీంద్రనాథ్ ఆలపాటి

## విషయసూచిక

గోపీచంద్
''అసమర్థుని జీవయాత్ర'' - హితశ్రీ

కన్యాశుల్క నాటక విమర్శనము - శ్రీపాద కామేశ్వరరావు

తెలుగు సాహిత్యం
కొన్ని నిజాలు - బొమ్మకంటి శ్రీనివాసా చార్యులు

భిన్నమతాలు
సామరస్య సూత్రాలు - అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి

బెర్ట్రాండ్ రస్సెల్ - డా॥ ఎన్. ఇన్నయ్య

విడిప్రతి రూ. 4/- వార్షిక చందా రూ.50/-

ముఖచిత్రం
కలతపడని ఖండిత
యువరాణి డయానా

'మిసిమి' లో ప్రచురించే వ్యాసాలతో సంపాదకులు ఏకీభవించారనుకో నవసరం లేదు.

# LIVING DICTIONARY
## (DEVIL'S DICTIONARY)

*Compiled by*
AMBROSE BIERCE (1911)

**Emancipation,** *n.* A bondman's change from the tyranny of another to the despotism of himself.

He was a slave: at word he went and came;
His iron collar cut him to the bone.
Then Liberty erased his owner's name,
Tightened the rivets and inscribed his own.

*G.J.*

**Emotion,** *n.* A prostrating disease caused by a determination of the heart to the head. It is sometimes accompanied by a copious discharge of hydrated chloride of sodium from the eyes.

**Encomiast,** *n.* A special (but not particular) kind of liar.

**Enough,** *pro.* All there is in the world if you like it.

Enough is as good as a feast-for that matter
Enougher's as good as a feast and the platter.

*Arbely C. Strunk.*

***Entertainment,*** *n.* Any kind of amusement whose inroads stop short of death by dejection.

**Enthusiasm,** *n.* A distemper of youth, curable by small doses of repentance in connection with outward applications of experience. Byron, who recovered long enough to call it "entuzy-muzy," had a relapse which carried him off-to Missolonghi.

**Envelope,** *n.* The coffin of a document; the scabbard of a bill; the husk of a remittance; the bed-gown of a love-letter.

**Envy,** *n.* Emulation adapted to the meanest capacity.

**Epaulet,** *n.* An ornamented badge, serving to distinguish a military officer from the enemy-that is to say, from the officer of the lower rank to whom his death would give promotion.

**Epicure,** *n.* An opponent of Epicurus, an abstemious philosopher who, holding that pleasure should be the chief aim of man, wasted no time in gratification of the senes.

**Epigram,** *n.* A short, sharp saying in prose or verse, frequently characterized by acidity or acerbity and sometimes by wisdom. Following are some of the more notable epigrams of the learned and ingenious Dr. Jamrach Holobom:

We know better the needs of ourselves than of others. To serve oneself is economy of administration.

In each human heart are a tiger, a pig, an ass and a nightingale. Diversity of character is due to their unequal activity.

There are three sexes; males, females and girls.

Beauty in women and distinction in men are alike in this: they seem to the unthinking a kind of credibility.

Women in love are less ashamed than man. They have less to be ashamed of.

While your friend holds you affectionately by both your hands you are safe, for you can watch both his.

**Ethnology,** *n.* The science that treats of the various tribes of Man, as robbers, thieves, swindlers, dunces, lunatics, idiots and ethologists.

**Eucharist,** *n.* A sacred feast of the religious sect of Theophagi.

**Eulogy,** *n.* Praise of a person who has either the advantages of wealth and power, or the consideration to be dead.

తెలుగులో మొదటి మనోవైజ్ఞానిక నవల

# గోపీచంద్

# ''అసమర్థుని జీవయాత్ర''

- హితశ్రీ

ఇరవయ్యో శతాబ్దంలో ఫ్రాయిడ్ యూంగ్‌లు ప్రతిపాదించిన మనో వైజ్ఞానిక సిద్ధాంతాలు సహజంగానే విశ్వ సాహిత్యాన్ని ప్రభావితం చేశాయి. ఈ సిద్ధాంతాల ఇతివృత్తాలతో ఎన్నో నవలలు వచ్చాయి. సాహిత్యంలో ఒక కొత్త పోకడ ఏర్పడింది. అదేమిటంటే, ఇతివృత్తం బాహ్య ప్రపంచంనించి అంతరంగ ప్రపంచానికి మళ్లటం. కథాసంవిధానానికి ప్రాధాన్యత తగ్గి, పాత్రల మనస్తత్వ చిత్రీకరణ ప్రధానాంశమైందన్నమాట.

గోపీచంద్‌గారు రచించిన ''అసమర్థుని జీవయాత్ర'' మనోవైజ్ఞానిక ఇతివృత్తంతో తెలుగులో వెలువడిన మొదటి నవల. ఇది కలకాలం నిలిచిపోయే విశిష్ట రచన. ఇందులో ఇతివృత్తం సీతారామారావు అనే పాత్ర ప్రవర్తన తీరుని వర్ణిస్తూ, అతని ప్రవర్తనని శాసించిన మానసిక శక్తుల ఘర్షణని ప్రదర్శించటం. ఈ విషయాన్ని చర్చించే ముందు ఫ్రాయిడ్ ''మనో విశ్లేషణ'' సిద్ధాంతం కొంచెం గుర్తు చేసుకోవాలి.

మన ప్రవర్తన ఏదైనా, దానికేదో ''ప్రేరకం'' ఉంటుంది. ప్రేరకం అంటే ఒక చర్య జరపమని మనిషిని ముందుకి నెట్టే ఓ శక్తి. ప్రేరకాన్ని కదిలించేది ''ఉత్సుకత''. ఉత్సుకత వెనక ఓ ఒత్తిడి ఉంటుంది. ఒత్తిడికి కారణం ఓ ఆవశ్యకత. ఏదైనా ఆవశ్యకత కలిగినప్పుడు, ఒత్తిడిఏర్పడి, ఒత్తిడి తొలగించు కోవాలనే ఉత్సుకత జనించి, ఉత్సుకత ప్రేరకాన్ని కదిలిస్తే, మనిషి ప్రేరణ పొంది కార్యోన్ముఖుడవుతాడు. ఉదాహరణకి శరీరంలో నీరు ఆవశ్యకమైతే నాలుక పిడచకట్టి దాహం అనే ఒత్తిడి కలిగి, అది తొలగించుకోవాలని ఉత్సుకత తొందర పెడితే ప్రేరకం వ్యక్తిని నీళ్ళు తాగమని ముందుకి నెడుతుంది. మనిషి ఆ విధంగా ప్రవర్తించి లక్ష్యం నెరవేర్చుకొని ఆవశ్యకత తీర్చు కొంటాడు. అంటే మనిషి ప్రవర్తనకి ఆవశ్యకతలు మూలం. ఇవి ప్రేరకాల ద్వారా మనిషి ప్రవర్తనని శాసిస్తాయి. ప్రేరకాల వెనక ఉత్సుకత, ఒత్తిడి, ఆవశ్యకతలు, లక్ష్యాలు ఉంటాయి. కనుక ఇవి చాలా క్లిష్టమైనవి. ప్రతి ప్రేరకానికీ ఓ లక్ష్యం ఉంటుంది. ఆ లక్ష్యానికి అనుగుణంగా అది మనిషిని ప్రవర్తింప చేస్తుంది. భౌతిక ప్రేరకాలు మనుగడకి సంబంధించినవి. వీటికంటే మనోవైజ్ఞానిక ప్రేరకాలు చాలా ముఖ్యమైనవి. భద్రత, ప్రేమ, గౌరవం, కీర్తి ఆత్మాభివ్యక్తి, సాహసం, గుర్తింపు, ఆశయాలు, ఆదర్శాలు, భయాలు మొదలైన భావాలకి సంబంధించినవి మనో వైజ్ఞానిక ప్రేరకాలు. ఇవి తీరటం మీదే మనిషి మానసిక సామరస్యం, సౌఖ్యం, ఆరోగ్యం, సామర్థ్యం ఆధారపడి ఉంటాయి. ప్రధాన ప్రేరకాల్ని, ఏదీ మరీ అతిగా లేదా మరీ మితంగా కాకుండా, సమైక్యతతో సాధించి నప్పుడు వ్యక్తి మూర్తిమత్వం సమతౌల్యంతో అభివృద్ధి చెందుతుంది. అలాంటి వ్యక్తి సామాజిక సమస్యల్ని, వ్యక్తిగత సమస్యల్నీ సమర్థతతో ఎదుర్కొనగలడు.

అయితే కొన్ని ప్రేరకాలు మనకి తెలియకుండా మన ప్రవర్తనని శాసిస్తాయి. ఇది

అచేతనాత్మక మనస్సు జరిపే పని అన్నమాట. ఫ్రాయిడ్ మనసుకి మూడు పొరలుంటాయన్నాడు. ఒకటి చేతన. మనకి తెలుస్తున్నదే చేతన. దీని వెనువెనకే ఉండి సులభంగా గుర్తుకి తెచ్చుకోగలిగేది ఉపచేతన. ఆలా సులభంగా గుర్తుకి రాకుండా అట్టడుగున ఉండి పోయిన భావాలగంప అచేతన. సామాజిక, నైతిక ఆంక్షల వల్ల మనసులోనే అణచబడ్డ తీరని కోరికలు, జ్ఞాపకాలు, ఆలోచనలు ఇందులో పెనవేసుకొని ఉంటాయి. నిద్రలో ఆంక్షలు పనిచెయ్యవు కనుక అవి స్వప్నాల ద్వారా బహిర్గతమవుతాయి. అచేతనపై ప్రాబల్యం వహించేది లిబిడో అనే సెక్స్ కోరిక అని ఫ్రాయిడ్ అన్నాడు. అయితే, లిబిడోని వివిధ రకాల ప్రేమగా భావించాలి.

ఈ మనసు పొరలే కాక క్రియాశీలమైన మనస్సుకి మూడు భాగాలుంటాయని ఫ్రాయిడ్ ప్రతిపాదన. అవి 1. ఇడ్ , 2. ఇగో, 3. సూపర్ ఇగో. ఇడ్ స్వభావం పాశవికం. అది సౌఖ్యాన్ని ఆహ్వానిస్తుంది. బాధని వర్జిస్తుంది. సహజాతాల తృప్తిని కోరుతుంది. ఇగో హేతుబద్ధమైన మనసు. అది పాశవిక వాంఛల్ని సాధ్యమైనంతగా అణిచి అచేతనలోకి తోసేస్తుంది. సూపర్ ఇగో అంతరాత్మలాంటిది. సమాజ వ్యతిరేక వాంఛల్ని అణగ దొక్కవలసిందిగా అది ఇగోను ఆదేశిస్తుంది. ఇగో అతి పాశవికతకీ, అతినైతికతకీ మధ్య సమన్వయం సాదిస్తూ, ఇడ్ సూపర్ ఇగోల నిత్య సంఘర్షణను తొలగించటానికి ప్రయత్నిస్తుంది. ఇడ్ , సూపర్ ఇగోలలో దేనిపాత్ర అధికమైనా అది మానసిక అనారోగ్యానికి దారితీస్తుంది.

మానవుడి ప్రవర్తన పూర్తిగా అర్థం చేసుకోవాలంటే అతని చేతనాత్మక ప్రేరకాల్ని మాత్రమే కాక అచేతనాత్మక ప్రేరకాల్ని కూడా తెలుసుకోవాలి. మనిషి ప్రవర్తన ఒక లక్ష్యాన్ని సాధించి తద్వారా ఒక అవశ్యకత నెరవేర్చుకోటానికి ఉద్దిష్టమవుతుంది. అయితే ఇవి సులభంగా లభించవు. ప్రేరకాలు క్లిష్టమైనవి. అవి సులభంగా అంతుపట్టవు. ఒక్కొసారి అవి పరస్పర విరుద్ధంగా ఉంటాయి. ఒకదానితో ఒకటి ఘర్షణ పడతాయి. ఉదాహరణకి ఏదో విధంగా ఆకలి తీర్చుకోవాలనుకొంటే, గౌరవం అడ్డురావచ్చు. ఇలా అనేక కారణాలవల్ల వ్యక్తి తన లక్ష్యాలను సాధించలేక పోవచ్చు. ఇందువల్ల మనిషి నిస్పృహకి లోనవుతాడు. భరించలేని మనోవేదన కలుగుతుంది. ఈ వేదననుంచి తప్పించుకోటానికి దారులు వెతుకుతాడు. న్యూనతాభావంతో సరిపెట్టుకోవచ్చు. ఒక్కొసారి న్యూనతాభావం బదులు దౌర్జన్యం, విరోధం పెంపొందించుకోవచ్చు. లేదా అచేతనాత్మకంగా కొన్ని రక్షణ పద్ధతుల్ని అవలంబించి ఒత్తిడి తొలగించుకోవచ్చు. పగటి కలలు, భ్రాంతులు, సమర్థనలు, పరిహారాలు, తాదాత్మ్యాలు, బాధ్యత విస్మరణలు, ఇతరులపై నిందారోపణలు, ఇతరులపైకి భావోద్వేగాల బదిలీలు, అణచివేతలు, వెనకడుగులు, వాంఛల ఉదాత్తీకరణలు ఈ కోవలోకి వస్తాయి. ఈ అచేతనాత్మక ప్రక్రియలు వ్యక్తిని వాస్తవ పరిస్థితుల్నించి తప్పించి గౌరవాన్ని కాపాడి తాత్కాలికోపశమనం కలిగిస్తాయి. అందువల్ల ఈ రక్షణ విధానాన్ని ''పలాయన విధానాలు'' అని కూడా వ్యవహరిస్తారు. అయితే ఇవి మరీ విపరీతమైతే వ్యక్తికి ఉన్మాదస్థితి కలిగించి ఆత్మహత్యకి కూడా దారితీయవచ్చు.

గోపీచంద్ గారి ''అసమర్థుని జీవయాత్ర'' నవలలో ఈ మనోవైజ్ఞానిక శక్తులకి ఆటవిడుపు. నవలలో ప్రధాన పాత్ర సీతారామారావు, అతని అంతరంగ ప్రదర్శనే నవల. అంతేగాని సంఘటనలూ, కథాసంవిధానం ప్రధానం కాదు. సీతారామారావు రక్షణ యంత్రాంగ

మనస్తత్వాన్ని పుణికిపుచ్చుకొన్నాడు. విచిత్రమైన అతని జీవితం "ఉన్నత శిఖరాగ్రంనుంచి స్వచ్ఛమైన జలంతో భూమిమీదపడి మలినాన్ని కలుపుకొని మురికి కూపంలోకి ప్రవహించే సెలయేటిని జ్ఞప్తికి తెస్తుంది." "చూసేవాళ్ళు మాత్రం దాని పతనానికి జాలిపడుతూ వుంటారు. దానికి ఆ జ్ఞానం వుందోలేదో మాత్రం ఎవ్వరూ చెప్పలేరు." అంటూ గోపీచంద్ మానవ ప్రవర్తనపై అచేతన ప్రభావాన్ని మొదట్లోనే ఆలంకారికంగా సూచించారు.

సీతారామారావు వంశం గొప్పదే. తండ్రీ, తాతముత్తాతలూ దాన ధర్మాలకి పేరెన్నికగన్న వారు. సీతారామారావు చిన్నతనం నుంచి తనకుటుంబాన్ని గురించి అనేకులు గొప్పగా చెప్పుకోవటం వింటూ ఉండేవాడు. "డబ్బుదేముంది. మనిషికి కావలసింది పేరు" అని అతనికి రూఢి అవుతుంది. తండ్రి పోతూ, "బాబూ మనవంశం పేరు నిలబెట్టు" అంటాడు. తండ్రి గతించినతరవాత 'తండ్రికి మించిన చెయ్యి' అని అంతా అనేటట్లు అతను ఉదారంగా ప్రవర్తిస్తాడు. అప్పులు యివ్వవలసిన వాళ్లు ఇచ్చినంతవరకే పుచ్చుకొంటాడు. మేనమామ నలభై వేల అప్పుని పదివేలు కూడా చెయ్యని పదెకరాలతో పరిష్కరిస్తాడు. అతని కుటుంబం పట్ల అభిమానమున్న రామయ్యతాత "చేతుల్లో నాలుగు రాళ్లు ఉంటే అంతా మూగుతారు. ఆ తరవాత మనమొగం చూచేవాళ్లుండరు బాబూ," అని హెచ్చరిస్తే "నేను ప్రతిఫలం కోరలేదు తాతా;" అంటాడు. ప్రతివాళ్లూ అతన్ని గౌరవిస్తుంటే బ్రతికిన నాలుగు రోజులూ ఇలా బతికితే చాలనుకొంటాడు.

సీతారామారావు బాగా చదువుకొన్నవాడు. ఆదర్శవంతమైన జీవితం గడపాలని ఉవ్విళ్లూరుతుండే వాడు. చిల్లర విషయాలకి అతీతంగా ఉండి ఎప్పుడు ఏదో ఒకటి ఆలోచిస్తుండే వాడు. పెళ్ళి చేసుకోవడం, పిల్లల్ని కనటం, కుటుంబ జీవితం గడపడమంటే అతనికి రోత. పెళ్లి చేసుకోకూడదనుకొంటాడు. కాని ఇందిర అనే అమ్మాయిని ప్రేమించడం జరుగుతుంది. పెళ్ళి చేసుకోకపోతే ఆమె దగ్గరికి రానివ్వదు. కాబట్టి పిల్లలు కలగకుండా జాగ్రత్తపడి, తన భార్య క్కూడా స్వాతంత్ర్యం ఇస్తే పెళ్లిలో వున్న చెడు తనకు అంటదనుకొంటాడు. "ఆమె జీవితం ఆమెది, నా జీవితం నాది. మధ్య మధ్య ఆనంద డోలికలు" అనుకొంటాడు. మనసులోని 'ఇడ్ ' అనే భాగం ఆనందం కోరింది. సూపర్ ఇగో అతని ఆదర్శాన్ని గుర్తుచేసింది. భార్యకు స్వాతంత్ర్యం ఇస్తే సరిపోతుందని ఇగో సమన్వయం సాధించిందన్న మాట. కాని అతను అనుకొన్నట్టు ఏమీ జరగదు. ఐదు సంవత్సరాలు దాటేటప్పటికి ఇద్దరు పిల్లలు, మూడు గర్భస్రావాలు. అతడు జీవితం చేతుల్లో కీలుబొమ్మ అవుతాడు. పరిస్థితులు తారుమారవుతాయి. అతని మామ పోలీస్ ఆఫీసర్. ఒక పెద్ద ఫరంలో గుమస్తాగిరి ఇప్పిస్తాడు. మామకు లోకువ అయ్యానని అతనికి మామ మీద కోపం వస్తుంది. ఎకౌంటు పుస్తకంలో ఓ బొమ్మవేసి, అదేమిటని మేనేజర్ అడిగితే "మామ" అంటాడు. ఉద్యోగం ఊడుతుంది. మళ్లా అతను ఉద్యోగం కోసం ప్రయత్నించడు. తన దగ్గర సహాయం పొందిన వాళ్ళు తన దగ్గరకు రావటం మానివేస్తారు. ఆ కసి అనేక విధాలుగా బయటపడుతుంది. దానికి తరుచు భార్య గురిఅవుతూ వుంటుంది. భార్య ఏమన్నా అది తనను చులకనచేస్తూ అన్నట్లే భావిస్తాడు. ఇంకేం, అత్తమీద కోపం దుత్తమీద అన్నట్లు కోపం భార్యమీదికి బదిలీచేసి ఆమెదే తప్పయినట్లు ప్రవర్తిస్తాడు. అదో మనస్తత్వ చిత్రం.

సీతారామారావుకి ఇంటి నాలుగు గోడలే జీవితపు సరిహద్దులవుతాయి. ఎవరైనా "ఏం చేస్తున్నారు" అని అడిగితే ఏముంది చెయ్యటానికి అంటాడు. ఈ ప్రపంచం అనుక్షణం

మారుతూ ఉంటుంది. ఈ మార్పుకి ఆదర్శం ఉన్నట్లు కనపడదు. ఇక మానవుడు చేసేది ఏమిటి?'' అని తన పలాయనాన్ని సమర్థించుకొంటాడు. ఇందుకు ఆదర్శరహితమైన యాంత్రిక పరిణామవాదం అతనికి తోడ్పడుతుంది. ఏదో చేస్తున్నామనే నాయకులు, మేధావులు, శాస్త్రవేత్తలు సత్యం తెలిసిన సమాజాన్ని మోసం చేస్తున్నారని ఆత్మవంచన చేసుకొంటాడు. ఇందుకు అతనికి ఏవో దృష్టాంతాలు దొరుకుతాయి. ''ప్రపంచానికి ఒక ఆదర్శం లేదు గనుక, ఏ పనికి ప్రయోజనం లేదు గనుక అన్ని పనులూ మంచే, అన్ని పనులూ చెడే, అంతేగాని ఇది మంచీ, ఇది చెడు అనేది లేదు. చట్టంమీద ఆధారపడి వుంటుంది.'' అనుకొంటాడు. ''అసలు ఏదో ఒకటి చెయ్యాలనుకోవడంలోనే ఈ చిక్కులు వస్తున్నాయేమో'' నని మెదలకుండా కూర్చుంటాడు. **నిర్నిమిత్తంగా పుట్టాం. నిర్నిమిత్తంగా బతకాలి. లేకపోతే చావాలి. అనుకొంటాడు. అసలు రహస్యం, ఏంచేసే సామర్థ్యం అతనికి లేదు. అందువల్ల నిర్వ్యాపారతని అచేతనాత్మకంగా హేతుబద్ధం చేసుకొవటం ద్వారా తన గౌరవానికి రక్షణ కల్పించుకొంటాడు.**

ఓ సారి మేనమామని అవసరమై వంద రూపాయలు పంపమని రాస్తే అతను పంపడు. దానితో అతనికి మండి ఇంకో ఉత్తరం అతన్ని దూషిస్తూ రాస్తాడు. మేనమామ జవాబిస్తాడు. అతని తండ్రికి తన వంశం, సంస్కృతి గొప్పదనే అభిప్రాయం ఉండి పరాయి వంశంలోని వాళ్ళు కనుక తమను తక్కువగా చూశాడనీ, అతని కీర్తే అతనికి ముఖ్యమనీ, సీతారామారావు కూడా తండ్రికి తగ్గ కొడుకై వంశ ప్రతిష్ఠ, కుటుంబ గౌరవం పేరుతో చేసిన చర్యల ఫలితం అతనే అనుభవించాలనీ, తనేం సహాయం చేసేది లేదనీ సారాంశం. పైగా జీవిత సంగ్రామంలో పాల్గొనలేని అసమర్థుడని చురక వేస్తాడు. అపజయాలవల్ల అచేతనలో న్యూనతాభావం కలిగి, ప్రజ్వరిల్లి దౌర్జన్యాన్ని పురికొల్పుతుంది. సీతారామారావు హృదయం అగ్నిగుండమవుతుంది. గిల్లికజ్జా పెట్టుకోటం మొదలుపెడతాడు. కుమార్తెను అనవసరంగా కొడతాడు. తర్వాత జాలిపడి దగ్గరికి తీసుకొంటాడు. తను ప్రతి ఆవేశానికి వశుడౌతాడు. తనది మెత్తని హృదయం. కుమార్తె పడి ఏడుస్తుంటే ఆ ఏడుపు సహించలేడు. కోపం వస్తుంది. కొడతాడు. చూసేవాడికి తన కఠినత్వమే కనిపిస్తుంది. భార్య రాత్రింబగళ్లు పనిచేసి జబ్బు తెచ్చుకొంటే, చేతులారా తెచ్చుకొన్నావని తిడతాడు. తను ఎంత కఠినుడు అనుకొంటాడు. తనకు కోపం రావటానికి కారణం తన మెత్తని హృదయమే. మెత్తని హృదయం అంటే నరాల బలహీనత అని ఒక స్నేహితుడు అన్నాడు. నరాల బలహీనత పరిస్థితుల వల్ల వస్తుందట. పరిస్థితుల్ని మార్చుకోవాలంటే అలా బుద్ధి కలగాలి. అలా బుద్ధి కలగాలంటే పరిస్థితులు మారాలి.'' ఈ పద్మవ్యూహాన్ని ఛేదించటం ఎట్లా? అని ఆలోచిస్తాడు. అతనికి ప్రపంచమంతా ఏకమై తన్ను హింసిస్తున్నట్లు అనిపిస్తుంది. భార్యతో తన బాధ, ఆరాటం, కష్టసుఖాలు అన్నీ వెళ్లబోసుకోవాలనిపిస్తుంది. తన ప్రవర్తనకు క్షమాపణ కోరుకోవాలనిపిస్తుంది. ఆమె దగ్గరికి వెడతాడు. ఏమంటే ఏమోననే భయంతో ఆమె ముక్తసరిగా మాట్లాడుతుంది. పరిస్థితి వక్రించి ఆమె చెంపమీద ఛేడేలున కొడతాడు. తను భార్యను కొట్టాడు! లోపల నరాలు చిటేలు చిటేలున ఎగురుతున్నట్లు అనిపిస్తుంది. అతనికి గంగిర్లు ఎత్తుతాయ్. ఆమెతో గడిపిన ప్రణయ జీవితం గుర్తుకి తెచ్చుకొంటాడు. హృదయంలో బాకులు కదుల్తాయి. ఇంట్లో ఉండలేక బయటకు వెడతాడు. రామయ్య తాత ఇంటికి వెడతాడు. తను భార్యను కొట్టానని చెబుతాడు. అతను చీదరించుకొంటాడు. సంఘర్షణ భరించలేని సీతారామారావుకి అంతా అయోమయమై పోతుంది. ఏదో సభ జరుగుతుంటే వేదిక ఎక్కి వేదికమీది వాళ్లందరి

అకృత్యాలూ పేర్కొని దూషిస్తాడు. అతనికి పిచ్చి పట్టిందని కొడతారు.

సభకి వచ్చిన రామయ్య తాత దగ్గరలో ఉన్న నిద్రగన్నేరు చెట్టు కిందకి తీసుకుపోయి అతన్ని ఓదార్చుస్తాడు. జ్ఞానానికి తగిన మనస్తత్వం లేకపోవటం వల్ల ప్రపంచంలో ఏమీ లేదని తెల్సి పతనం చెందాడనీ, ''ఎందుకు'' అనే ప్రశ్న మానవుడి చేత మంచి పనులు చేయించటానికి పుట్టిందనీ, మంచి పనులు చెయ్యటమే మానవ స్వభావం అయినప్పుడు ''ఎందుకు'' అనే ప్రశ్న అవసరం క్షీణిస్తుందనీ, వ్యక్తిగత దృష్టి వదలి సాంఘిక దృష్టి అలవరచుకుని, సంఘాన్ని ముక్కలుగా కాకుండా మొత్తంగా చూడటం నేర్చుకొని ముందుకి పొమ్మనీ ఉపదేశించి వెళ్లిపోతాడు. ''మిథ్య మిథ్య అంతా మిథ్య'' అంటూ సీతారామారావు తన విశ్వాసాన్ని నిలబెట్టుకోటానికి అరుస్తాడు. చీకట్లో తిరిగి తిరిగి స్మశానం దగ్గరికి వెడతాడు. ఓ చితి మండుతూ ఉంటుంది. భ్రాంతిలో తండ్రి కనిపించి ''నా గౌరవాన్నీ, వంశ ప్రతిష్ఠనూ, కుటుంబ ఔన్నత్యాన్నీ బుగ్గిపాలు చేశావు'' అని నిందిస్తాడు. తన పతనానికి తండ్రి సంస్కార వారసత్వమే కారణమని సీతారామారావు జవాబిస్తాడు. తనలాంటి ఆకార మేదో తనమీదికి దూకుతుంది. ఆ ఉన్మాదంలో సీతారామారావు తనని తానే హత్యచేసుకొంటాడు.

ఇదీ సీతారామారావు విషాదాంత కథ. అతని పతనానికి కారణాలు అతని మనస్తత్వం, అతని సంస్కారమే, తండ్రి గొప్పతనాన్ని అందుకోవాలనే అచేతనాత్మక ప్రేరకం అతని జీవితాన్ని శాసిస్తుంది. పరిస్థితుల మార్పుకి అనుగుణంగా ఆదర్శం మార్చుకోలేక నిస్పృహ చెందుతాడు. అచేతనలోని పలాయన పద్ధతులు తాత్కాలికోపశమనం ఇస్తాయి. ఆ మానసిక స్థితినించి అతనిని కాపాడే శక్తి అతని భార్యకి ఉన్నప్పటికీ ఆమె అతని గొప్పతనాన్ని ఆరాధించి అడుగులకి మడుగులొత్తుతుందే గాని, అతని పట్ల తనకి గల ప్రేమని తారాస్థాయికి తీసుకువెళ్లి ఆత్మవిశ్వాసం కలిగించి రక్షించలేకపోతుంది.

అచేతన ఎప్పుడూ ప్రేమ కోరుతుంది. ఆత్మీయత కోరుతుంది. ఆవశ్యకమైనంతగా ప్రేమ, ఆత్మీయత భార్యనించీ, స్నేహితులనించీ, సమాజంనించీ లభించలేదనే అచేతనాత్మక భావం అతన్ని ఒంటరివాణ్ణి చేస్తుంది. అందువల్లే అతను ఉన్మాదియై అంతమై పోవటం జరుగుతుంది. ఆ విధంగా అసమర్థుని జీవయాత్ర ముగిసిపోతుంది. ఈ నవలలో గోపీచంద్ గారు ఒక సున్నితమైన హృదయమున్న, చదువుకొన్న, మధ్య తరగతి సంస్కారంలో పెరిగిన యువకుడి ప్రత్యేక పరిసరాలనీ, అతని మనసులో చెలరేగిన మానసిక శక్తుల విలయతాండవాన్నీ , అతని దయనీయమైన మానసిక నగ్నతనీ క్రమ పతనాన్ని ఆవిష్కరించిన తీరు అసమానం. ''అసమర్థుని జీవయాత్ర'' ఆంధ్ర సాహిత్యంలో చిరస్మరణీయమైన గొప్ప మనోవైజ్ఞానిక నవల. ★

*The disappearance of communism and the cold war has not necessarily ushered in a contagious peace and prosperity for Europe. On the contrary, it has pitched the continent into a situation without precedent, without guarantees by raising the spectre of instability in a world of states with crumbling borders.*

***Haripriya Ramdas in 'Hindu'.***

# కన్యాశుల్క నాటక విమర్శనము

- శ్రీపాద కామేశ్వరరావు

## 1. గీర్వాణ ఫక్కీ

మన అలంకారికులు నాటక కథను రెండు భాగములు చేసినారు:- 1. ఆధికారికము, 2. ప్రాసంగికము. మొదటి దానిలో ఫలభోక్త నాయకుడు. రెండవ దానిలో ఫలము నాయకేతరులకు చెందును. ప్రాసంగిక కార్యములవల్లనే కథ జటిలమగును. వీటి కన్యోన్య సంబంధము కల్పించినందువల్ల కొన్ని కార్యములు ఆధికారికమునకు అనుకూలించి మరికొన్ని ప్రతికూలించును. ఈ కార్యపరంపర సాగించడమందే నాటక కళా ప్రకర్ష వ్యక్తమవుతుంది. ఇందుకే పలు రంగములు (స్థలములు - Scenes) కూర్చబడును. అందలి పాత్రములు చెప్పే మాటలు, చేసే పనులు, పరిశీలిస్తే కథా చమత్కృతి, పాత్రగుణములూ విశదమౌతవి. కొన్ని రంగములలో సమకాలిక - ఆచార వ్యవహారములు వ్యక్తమగును. దీనికే Local coloring అని పేరు. ఈ మూడు విషయములయందున్నూ దేశకాల పాత్రములు ప్రతిఫలింప జేయడమే నాటకోద్దేశము. కవితాసారమునకు ఇవే నికష పాషాణములు.

కథా విన్యాస ఫక్కీ వివరిస్తే కన్యాశుల్కము నాటక మవునో కాదో తేలుతుంది. దశరూపకమనే నాటక లక్షణ గ్రంథమందు కథ ఐదు భాగములుగా విభజించ బడినది:- 1. బీజము, 2. బిందువు, 3. పతాక, 4. ప్రకరి, 5. కార్యము. ఇవి కన్యాశుల్కమందు ఈ క్రింది రీతిని వివరించవచ్చును. సుబ్బిని లుబ్ధావధానికి పెళ్ళిచేసే సంకల్పము బీజము. తద్విషయక ప్రయత్నములు, అనగా సంబంధము నిర్ణయించుకోవడము, మధ్యవర్తుల ద్వారా వర్తమానము లంపడము, శుల్క నిర్ణయము, తాంబూలా లివ్వడము మొదలైన చర్య బిందువు. అగ్నిహోత్రుడు బంధువులను పెళ్ళికి పిలవడము, ఏనుగులు, గుఱ్ఱాలు, ఒంటెలు మొదలైనవి సమకూర్చుకొని రామచంద్రపురం తర్లి వెళ్ళడం పతాక. బుచ్చమ్మ కనపడక పోవడము, మాయ సుబ్బిని లుబ్ధావధాని పెళ్ళాడడమూ ప్రకరి. సుబ్బిపెళ్ళి తప్పిపోవడము కార్య(భంగ)ము.

ఈ వివరణబట్టి కన్యాశుల్కము నాటకమే అని గ్రహించవచ్చునుకదా? ఇది ప్రహసనము (Farce) అనే విమర్శకులు ఈ గ్రంథమును చులకనచేసి "It is afterall a farce" అనుట విచారకరము. ఈ గ్రంథమందింకో చిత్రముంది. పైన వివరించిన నాటక ఫక్కీ ఆధికారిక కార్యమునందే కాక ప్రాసంగిక కార్యములందు కూడా కనబడుతూన్నది.

అగ్నిహోత్రుడు సుబ్బిపెళ్ళి చేయడానికి ఎంత ఎంత పాకులాడినాడో కరటకశాస్త్రి పెళ్ళి తప్పించడానికి అంత యత్నము చేసినాడు. అట్టి యత్నమును కథా సంగ్రహమందు వివరించినాము. కనుక ఇచ్చట విభాగ ప్రక్రియ మాత్రమే సూచిస్తాము - సుబ్బిని లుబ్ధుని కివ్వవద్దని వెంకమ్మ పట్టు బీజము. బుచ్చమ్మ పోరు, కరటకశాస్త్రి చేసిన మాయ బిందువు, మధురవాణి పట్టుదల పతాక. గిరీశమూ, రామప్పంతులూ వ్రాసిన ఉత్తరాలు ప్రకరి. మాయాసుబ్బి వివాహము కార్యము.

ఈ రెండు కార్యములకూ పరస్పర విరోధము ఉండుటచేత మొదటిది విఫలమై రెండోది సఫలమయింది. ఆ కార్యము ఖేదాంతము, ఈ కార్యము మోదాంతము. మొత్తముపై నాటకము ఖేదమోదాంతము. (Tragic - comedy) మన వాఙ్మయము నందలి ప్రసిద్ధ నాటకములు - నలీయము, హరిశ్చంద్ర, శాకుంతలము, ఉత్తరరామ చరిత్రమున్నూ ఇట్టివే.

## 2. పాశ్చాత్య ఫక్కీ

ఇప్పటి విద్యార్థికులు కొందరు ''దశరూపకము'' ఆధునిక లక్షణ గ్రంథము కాదనిన్నీ, ఆంగ్లసాహిత్య

పరిచయము, విదేశాదర్శ పక్షపాతము కలిగించడము వల్ల నాటకము నాణెము నెంచే (Appreciate) టప్పుడు పాశ్చాత్య నియమాలుపయోగించ వలెననే అభిప్రాయ పడుతున్నారు. వాళ్ళని కూడా సంతోష పెట్టడమవసరము. కనుక సుప్రసిద్ధ ఆంగ్ల విమర్శకులైన Bradley గారు ఏర్పరచిన నాటక కథా విన్యాస నియమము గీటురాయిగా వుపయోగించి చూతము. ఆ మహనీయుడు అయిదు భాగములుగా కథా విన్యాసమును విభజించెను.

ఖేదాంత నాటకము

1. Exposition (కార్యవివరణ)
2. Complication (కార్యాతిశయము)
3. Crisis (సంకటావస్థ)
4. Resolution (కార్యవిజృంభణము)
5. Catastrophe (చరమ విపత్తి)

మోదాంత నాటకము:-

1. Situation (కార్యవివరణ)
2. Complication or Entanglement (కార్యపరిణతి)
3. Denowment (కార్యాపరిణతి)

ఖేదాంతములయందు నిర్దేశించిన 2,3,4 అవస్థలు మోదాంతములలోని రెండో అవస్థయందలి భాగములుగా గణిస్తే రెండు రకాల నాటకాలకూ మూడు భాగములే ఏర్పడును. ఏ కార్యనిర్వాహణమందైనా సర్వసాధారణముగా కనపడే అవస్థలు మూడే:- ఆరంభము, అతిశయము, అంతము. ప్రస్తుత నాటక కథా సంవిధానము ఈ మూడు భాగములయందు చక్కగా ఇమిడిపోవును.

ఏ నియమాలను బట్టి పరీక్షించి చూసినా ''కన్యాశుల్కము'' నాటక మనక తీరదు.

ఘటనా రచన:-

ఈ నాటక మందలి ఘటనలలో ముఖ్యమైనది సుబ్బి వివాహ సంకల్పము. దీనికి తక్కిన ఘటనలతో సన్నిహిత సంబంధముంది. దీనితోటి దూర సంబంధముండి ఈ నాటక పాత్రముల గుణోన్మీలనము చూపించే ఘటనలు చాలా కలవు. అవి పాత్ర పోషణకు పనికివచ్చును. మరికొన్ని ఘటనలు దేశకాల పరిస్థితులను సూచించును. వ్యర్థమైన ఘటన కానరాదు. ప్రతి రంగమందలి సంభాషణా సార్థకముగా నుండును వ్యర్థమైన మాట వెతికినా కనబడదు. మచ్చుకి రెండు రంగములు పరిశీలిద్దాము:-

మొదటి అంకమందు రెండు రంగము లున్నవి, వాటియందు పూటకూళ్ళమ్మల స్వభావము, గిరీశము బోటి రిజాలా యువకుల చరితము, భోగముదాని చిత్తవృత్తి, కానుకి గతిలేకున్నా నూటికి ఫర్వాలేదనే డాంబికులు చిత్రింపబడినారు.

రెండో అంకములో అగ్నిహోత్రావధానినీ, బుచ్చమ్మనూ పునర్వివాహం పక్షమునకు తిప్పవలెనని గిరీశం పాటుబడగా మొదటి యత్నములో అంతా వ్యర్థమైనా రెండో యత్నములో కొంతవరకు జయము ప్రాప్తించెను.

ఈ యంకమందు మూడో రంగములో గిరీశం తన అభిప్రాయములను కొంత మార్చుకొనెను. చిన్న బాలికలను ముసలివాళ్ళకు పెళ్ళి చేయడము మంచిదనీ, శుల్కము పుచ్చుకొనడము న్యాయమనీ అతని ఇప్పటి వాదము. ఈ పరివర్తనము హాస్య రసమును పోషిస్తూ స్వార్థపరులు యే యెండకు ఆ గొడుగు పట్టుటకు కొంకరని బోధిస్తుంది. అగ్నిహోత్రునికి కోర్టులూ, దావాలన్న ప్రీతి అని గ్రహించి ఆయనను సంతోష పెట్టడానికిన్నీ గిరీశం తన కార్యము సాధించుకొనడానికిన్నీ ఈ మార్పవసరము.

జ్యోతిషమందూ, భూతాదులయందూ జనుల కెట్టి మూఢ విశ్వాసమున్నదో 3,5 అంకములలోని మొదటి రంగములో చూపబడ్డది. జాతకాల బనాయింపు, దయ్యములను సీసాలలోకి దింపి భూస్థాపన చెయ్యడమూ,

లుబ్ధావధాని కొండలమూ దీని కుదాహరణములు.

రామప్పంతులు లేనివేళ పుస్తె ముడివేయించి రూపాయిాలెగవేసి శాస్త్రినీ, ఎరువు కంటె పట్టుకొని శిష్యుడున్నూ పారిపోయినందుకు ఉగ్రుడై పంతులు లుబ్ధావధానితో "శాస్త్రి నీకు రెండో పెళ్ళి ముండని కట్టబెట్టే" నాడని అన్నంతమాత్రాన అవధానికి పీడకలలువచ్చి అందులో "మాయా నుబ్బి (శిష్యుడు) మొదటి మగడు నాపీక నులుముతున్నా"డని కేకలు వేసి గోలపెట్టి దాన్ని ఇంటినుండి గెంటివేయవలెనని నిశ్చయించి నాడు. ఇంతకన్న మూర్ఖుడుంటాడా?

పేకాటరంగము (5వ అంకము, రెండో రంగము) కున్నూ, నాటకమందలి ముఖ్య ఘటనలకూ సన్నిహిత సంబంధము అంతగా లేదు. కాని ఈ రంగమువల్ల తమ్మి పోషిస్తున్న మహాజనులింటికి రానప్పుడు సానులు కాలయాపన మేలాగు చేస్తారో తెలుస్తుంది; పోలిసెట్టి నైజము తేటపడుతుంది. రామప్పంతులికి తెలియకుండా కరటకశాస్త్రి శిష్యుడు మధురవాణికి కంటె నిచ్చి ముందు కథకు బీజము నాటినాడు. దాని వల్లనే కథ సాగింది. కంటె సంగతి రామప్పకు తెలిస్తే కథ ముగిసినట్టే; కూనీకేసు బనాయింపు కవకాశ ముండదు; లుబ్ధావధానికి ఏ దిగులూ వుండదు, పశ్చాత్తాపమే కలుగదు; కథా వైచిత్రి తగ్గిపోవును.

సారాదుకాణము సీనుకూడా అవాంతరఘటనే. దానివల్ల బైరాగుల దురాచారములు, అమాయకులను వాళ్లు వంచించే తీరులూ, వాళ్ళ మెట్ట వేదాంతాలూ, పోలీసువాళ్ళు దొంగసాక్ష్యము బనాయించడమూ, పైకి పెద్దమనుష్యులుగా కనపడేవాళ్లు రహస్యముగా చేసే తప్పుపనులూ తెలుస్తవి.

ఇదే రీతిని జాగ్రత్తతో పరిశీలిస్తే ఈ నాటక మందు ఘటనా సార్థకత కనపడుతుంది. ఘటనలు చాలా ఉండడముచేత ఆఖ్యానవస్తువు జటిలమై, రసస్ఫూర్తి అలవడినది. ఘటనలలో ఘాతాప్రతిఘాత ముందని ఇదివరకే చూపినాము. కొన్ని ఘటనలు కథను ముందుకు నెట్టగా, కొన్ని దానిని వెనుకకీడ్చును. ఇది కాక నాటకమునందలి ముఖ్యపాత్రలకు "ఇది చేయనా? అది చేయనా?" అనే సంకటావస్థ (Crisis) ప్రాప్తించింది. ఒక్క మధురవాణికి మాత్రము ఈ యవస్థ పట్టలేదు. ఈ కారణములచేత ఆమెకు భావసమరము (Internal conflict) లేదు. నాటక రచనలో భావసమరము ముఖ్యపాత్రములకు కల్పించునట్లు కథను రచించిన కవి వుత్తముడు. ఇట్టివానికి సంస్కృతాలంకారికులు "మహాకవి" అనే సార్థకమైన పేరు పెట్టినారు. "ఆచార్య", "ఉపాధ్యాయ", "మహాకవి" మొదలైన బిరుదులు మొదట సార్థకములై నానాటికి నిరర్థకములైనవి. పూర్వము శంకర, రామానుజ, గంగేశ, మొదలగు బిరుదులిప్పుడు వంద మూడుటోళీల కింద వాడబడుతున్నవి; వంటచేసేవాడూ ఆచార్యుడే!

## 2. పాత్ర పోషణ:

### 1. గిరీశం

ఇది నాటక విషయమందు రెండో విషయము. ఈ నాటకమందలి పురుష పాత్రములలో ప్రఖ్యాతి చెందినది గిరీశము. నాటక ప్రదర్శకులకు, ప్రేక్షకులకు ఇదే ముఖ్యపాత్రమని నమ్మకము. కాబట్టి ముందు దీనిని పరిశీలింతాము.

గిరీశం పైన లక్ష్మీ సరస్వతులు చిరికన్ను వేసినారు. ఇతనికి చదువు పూర్తికాలేదు; సంపద పూర్ణానుస్వారము; కాబట్టి ఉద్యోగమేమీ లేకుండా నోరు పెట్టుకుని జీవిస్తుండేవాడు. మనిషికి కలిమి లేకపోయినా మాటలకు లేమి లేదు. ఇతడు కొన్ని రోజులు మధురవాణి అనే భోగముదాని నుంచుకొని, పై పెచ్చు సంసారి కాంతలపై కన్నువేసి, ఉత్తరాలు వ్రాస్తూ వుండేవాడు. అందువల్ల కొన్ని ప్రమాదములు సంభవిస్తుండెను. పూటకూళ్ళమ్మ ఒత్తిడి లేకుండా ఆమెతో అసంగతమైన చెలిమి చేసెను. ఈ పాపము కోడై కూసింది. పిల్లవాళ్ళకు చదువు చెప్పుతానని పూనుకొని డబ్బు పుచ్చుకోవడమే కాని, చదువు చెప్పలేదు సరికదా, ఎప్పుడూ కబుర్లు,

చుట్టకాల్చడము నేర్చినాడు. ఇతడు ప్రత్యుత్పన్న మతి. అనగా ఎట్టి కష్టదశలోనైనా మతి పోగొట్టుకోక తగిన ఉపాయము వల్ల తరించగలడు. ఫోటోగ్రాఫరు కివ్వవలసిన సొమ్మె గవేసి తన్నలమిన తక్కిన కష్టాలు తప్పుకొనుటకు ఊరువిడిచి పారిపోదలచినాడు. ఇతని నోటి బూకరానికి బడాయికీ అంతు లేదు. హైదరాబాదు నవాబు తనకు నెలకు వెయ్యి రూపాయిల ఉద్యోగమిస్తానన్నాడని అందరితోనూ చాటినాడు. దీనివల్ల పరపతి హెచ్చింది. పూటకూళ్ళమ్మ స్వంత ఖర్చుకిచ్చిన ఇరవై రూపాయిలూ దుర్వ్యయం చేసినందున ఆమె అతనిని వెదికి వెదికి మధురవాణి ఇంట్లో వుండునని వూహించి చీపురుకట్ట పట్టుకొని అక్కడికి రాగా మధురవాణి మంచము కింద దూరి అక్కడ అదివరకే దాగియున్న రామప్పంతులిని ముందుకు నెట్టి, చీపురుదెబ్బ లతనిపాలుచేసి, పై పెచ్చు తానుగూడా అతని తలదిమ్మి పట్టేటట్లు మోది పూటకూళ్ళమ్మచే చెడ తిట్టించెను. ఇతని చాతుర్యమిట్టిది. మధురవాణిపై నమ్మకము లేకపోయినా ప్రాణము పెట్టే వానివలె నటించినాడు. అగ్నిహోత్రుని ఆవేశమునకు తగినట్టు గుగ్గిలము వేసి అతని దావాలన్నీ ఖర్చు లేకుండా నడిపిస్తానని ఆశపెట్టినాడు. అతడు తన్ను తిట్టినప్పుడు ''పెద్దలనడము పిన్నలు పడడమూ విధేయక'' మని సంతసింపజేసినాడు. బుచ్చమ్మని చూడగానే వలచి కనికారము కలవానివలె కనపడి - My heart melts - అందరి కళ్ళలో దుమ్ముకొట్టి ఆమెను లేవదీసినాడు. వెంకటేశముతో తాను Social reformer కావున Infant marriage. bride-money, చిన్న పిల్లలను పెద్దవాళ్ళకు పెళ్ళి చేయడము తనకు గిట్టవనీ చెప్పి అగ్నిహోత్రుని దయ సంపాదించుటకు తన Views మార్చుకున్నాడు. అలాగు అప్పుడప్పుడూ Opinions change చేస్తేనేకాని politician కాడని సమాధానమిచ్చినాడు. ఇతడు గోడమీద పిల్లిలాగు జీవించే ఏబ్రాసి కాని స్థిరమనస్కుడు కాడు. పాపభీతి లేని పాషండుడు, ఋజుమార్గవర్తి కాడు. అవసరము వస్తే అబద్ధాలకి జంకడు. లోకజ్ఞానము బాగుగా కలదు. మూఢ విశ్వాసికాదు. దయ్యాలూ, అంజనము వేయుట మొదలైన తాంత్రికచర్య దబ్బర అని గ్రహించినాడు. వంచన చేయడములో సిద్ధహస్తుడు.

బుచ్చమ్మని బుట్టలో వేయవలెనని శృంగార చేష్టలు, సరసంపు మాటలు మొదలైన జారుల దారులు తొక్కి లాభములేక న్యాయమైన కొత్తదారి తొక్కాలి అని నిశ్చయించి Widow marriage civilisation కల్లా నిగ్గు అని నిర్ధారణ చేసినాడు. బుచ్చమ్మ తల్లి నూతిలో పడ్డప్పుడు తాను దిగి తీసినప్పటి నుండి తాను సత్యహరిశ్చంద్రుడని ఊరందరికి నమ్మకము కలిగిందని తెలుసుకుని బుచ్చమ్మ యెడ తానెంత చనువు చేసినా క్షమించే దాకా ఫర్వాలేదని ధైర్యముతో మసలినాడు. చేసిన ఉపకారానికి అతడు కోరే ఫలము బుచ్చమ్మని లేవదీసుకొని పోవడము. ఇదీ అతని నీతి. ఆమెకు Love stories చెప్పి ground prepare చేసి స్త్రీ పునర్వివాహము మంచి ఆచారమని బోధింప నిశ్చయించి, వెంకటేశానికి పాఠము చెప్పే మిషపైని Widow marriage పాపకార్యము కాదని వేదములలోనూ, శాస్త్రములలోనూ, పురాణములలోనూ శంకరాచారి పత్రికలలోనూ ఉందని నోటికి వచ్చినట్లు ప్రమాణములు చూపి, తనబోటి బ్రహ్మచార్లకు వితంతువులను పెళ్ళి చేసుకోవడమే ముఖ్య విధి అని బోధించి, అట్టి పెళ్ళిళ్లు అయిదు వేలయినవనీ, ఒక్కొక్క దానికి Widow marriage Association వారు నెలకు నూరు రూపాయలు పురస్కార మిస్తారని కోతలు కోసి బుచ్చమ్మ కాశ పుట్టించినాడు. తుదకు వితంతువులను వివాహము చేసుకొమ్మని దేవుడు ఆజ్ఞాపించినాడు, కనక అలాగు చేయని వాళ్ళకు ఘోరమైన పాతకము వచ్చునని భయపెట్టినాడు. ఇదంతా వట్టి బూకరింపు. సాధ్యము (End) మంచిదే కాని సాధకము (Means) బాగులేదు; స్త్రీ పునర్వివాహము అవశ్య కర్తవ్యమే, కాని గిరీశం చెప్పిన యుక్తులు నబబుగా లేవు. వట్టి అమాయకురాలు కనుక వలలో పడ్డది. ఈ వాదము సహేతుక మనుకొంది.

వెంటనే ''సరే, బ్రహ్మచారికి విధంతును పెళ్ళాడడము విధి అన్నారు కదా, మీరెందుకాలాగు చేయరేదు?'' అని బుచ్చమ్మ ప్రశ్నించగానే ''ఇందుకు రెండు కారణములున్నవి'' అని జవాబు చెప్పి కారణములు వివరించినాడు. మొదటిది లోకోపకారము చేయవలెననే వ్రతము. అనగా పిల్లలకు చదువు చెప్పడము, సాని

వాళ్లని హతమార్చడము, నూతులలో పడ్డవాళ్లని తియ్యడము, ఇటువంటి పనులు చేయడానికి వీలుండదని తాను పెళ్లి మానుకున్నాడట. రెండో కారణము గొప్ప రహస్యము కనుక ఎవ్వరితోనూ చెప్పనని ప్రమాణము చేస్తే చెప్తానన్నాడు. బుచ్చమ్మ అందుకు సమ్మతించి అతనిమీద ప్రమాణము చేసింది. అప్పుడు మొదలుపెట్టి నాడు తన వంచన. ''నీ వంటి బంగారు బొమ్మ, గుణవంతురాలు నన్ను పెళ్లి చేసుకొమ్మని కోరితే చేసుకుంటాను. ఎందుచేతనంటే — లోకానికన్న విలువగల నీ బోటి రత్నమునకు ఉపకారము చేయడము లోకోపకారము కంటే విలువైనది.'' బుచ్చమ్మ ఔ నన్నది. పిమ్మట పెళ్లిచేసుకొన్న తర్వాత స్థితిని అతిశయోక్తిగా వర్ణించి, బుచ్చమ్మ మనసు కరిగించినాడు. ఈ వర్ణన మూఢుడైన వెంకటేశమునకూ నచ్చి ''(కొంపతీసి) మా అక్కయ్యను పెళ్లాడేసారా ఏమి''టని సహజ సరళముగా అడిగినాడు. ఈ సందేహము బుచ్చమ్మకీ కలిగి గిరీశం జవాబు కెదురు చూస్తున్నది. అప్పుడు ''ఆc : మాట వరసకంటే (నీకు) మతిపోయిందా ఏమి''టని వాళ్ళ ఆందోళన మాపినాడు. ఈ మాట విన్న తోడనే బుచ్చమ్మ ''అంతేకదా,'' అని తెప్పరిల్లి ఊపిరి తీసింది. ఆ తరుణము మించిపోకుండా ''అంతకంటే అదృష్టము నాకు పట్టడమేలాగు? ఆ మాట మనమెవర మన్నా మీవాళ్ళు తన్ని తగలేస్తారు. రహస్యముగా నీతో చెప్తున్నాను. నిన్ను పెళ్ళాడతాను కాని అచ్చమ్మనీ, పిచ్చమ్మనీ చేసుకోను'' ఇంతలో బుచ్చమ్మ కాశ పెరిగింది.

''లోకములో వాళ్ళు వితంతువులకు వివాహము చేయకపోవడానికి కారణము చెప్తాను విను; పెళ్ళిలేకుంటే వితంతువులు పుట్టింటి వద్దనే వుంటారు. శక్తి వున్నంత కాలము చాకిరీ యథేచ్ఛముగా చేస్తారు. జీతమివ్వనక్కరలేదు. పెళ్ళి చేస్తే అత్తింటికి పోతారు, చాకిరీ చేసే వాళ్ళుండరు,'' అని గుట్టు రట్టు చేసినాడు.

బుచ్చమ్మ మనసు కరిగించడానికి గిరీశం ఉపయోగించిన అస్త్రాలు అయిదు, మొదటిది-శృంగార కథలు చెప్పడము. రెండోది-వేదము, శాస్త్రము, పురాణము, ఆచారము, మతాధికార్లు మొదలైన సనాతన ధర్మోపదేశకులంతా వితంతు వివాహము నిషేధించలేదని బోధన. మూడోది-వితంతువులు పెళ్ళాడితే పిల్లలని కనుక్కొని వాళ్ళని చూసుకొన్నందువల్ల కలిగే ఆనందము, పెనిమిటివల్ల చేకూరే సుఖము, సంసారమున అనుభవించే భోగము, ప్రపంచమందు కలిగే కీర్తి మొదలైన గొప్ప లాభములు వర్ణించి, భావస్థితి కళ్ళకు కట్టినట్లు చేసినాడు. ఈ అస్త్రం అమోఘము. దీనిని విన్న తర్వాత బుచ్చమ్మ తన మనసులో - ''ఆహా! నేనితన్ని పెళ్ళాడితే ఈ సుఖము, ఈ భోగము, ఈ ఆనందము నాకు కలుగవచ్చును. అందువల్ల నష్టమేమి? పాపము రాదు. పెళ్ళాడకపోతే భగవంతుని ఆజ్ఞ మీరిన దాననౌతాను. పాపము మెడకు చుట్టుకుంటుంది. తల్లిదండ్రుల మాటవిని పెళ్ళాడకపోతే దుర్భరమైన బానిసము అనుభవించి, నిర్భర బ్రహ్మచర్యమున వుండి సాటి వాళ్ళందరూ సంసార సుఖము అనుభవిస్తూ ఉంటే అందని పళ్ళకు అర్రులు చాచవలసి వుంటుంది. వీళ్ళదగ్గిర ఉంటే సుఖము సున్న, కష్టము దుర్భరము; వీళ్ళని విడిచిపోయి పెళ్ళి చేసుకుంటే నిరతిశయానందము అనుభవించవచ్చును, కష్టము కనపడదు. కనుక పెళ్ళి చేసుకోవడమే మేలులాగుంది'' అని అనుకొని యుండును. సుఖపడవచ్చుననే ఆశవుంటే ఎంత కష్టమైనా పడవచ్చును. అట్టి ఆశ లేనప్పుడు జీవనమే రుచించదు. ఆశ కదా, జీవితానికి ముఖ్యమైన ఆసరా! నిరాశాకలితమైన జీవితము నిర్భరమేవుట నిశ్చయము.

ఇంతవరకూ పనిచేసిన తరువాత సుబ్బిపెళ్ళి దగ్గరపడినందున పందిళ్ళు వేయించే పెత్తనము గిరీశము పైకి పడింది. ''ఏకక్రియా ద్వ్యర్థకరీ'' అన్నట్లు లుబ్ధావధాని పేర ఉత్తరము వ్రాసినాడు. అందు అతని యవస్థకు వగచినట్లూ వాత పెట్టినట్లూ హాస్యకరుణారసము లూరుతున్నది. భాషకూడా తదనుకూలముగానే ఉంది. ఈ ఉత్తరము బుచ్చమ్మను సంతోషపెట్టి ఉబ్బునేడ్పించింది. అయినా సుబ్బిపెళ్ళి ఆగేటట్లు లేదు. పప్పు రుబ్బుతూ బుచ్చమ్మ కంట నీరు పెట్టింది. తండ్రి ఊళ్లో లేడు. తల్లి వాకిట పడ్డది, వెంకటేశం ఆడుకోపోయినాడు. మంచి అవకాశం చిక్కిందని మరి రెండస్త్రాలు ప్రయోగించ దలచినాడు.

''ఏమి వదినా, కంటనీరు పెట్టుతున్నారు? నా మనస్సు కరిగిపోతుంది'' అని గిరీశం పలుకరించగానే

బుచ్చమ్మ ''సుబ్బికి ఈ సంబంధము తప్పించారు కాదు గదా?'' అని సెలాయించగా, అతడు ''నేను రెండు విధాల ఖేదపడుతున్నాను - సుబ్బికి ఈ సంబంధము తప్పించలేక పోతినని ఒకటి, బుచ్చమ్మను పునస్త్రీని చెయ్యలేక పోయినాను కదా అని రెండు. ఇవి సంతతము నన్ను బాధిస్తున్నందువల్ల విరక్తి పుట్టి ఊరు విడిచి పోదామనుకుంటున్నాను'' అని అనగానే వెంటనే ''వెళ్ళిపోకండి'' అని బుచ్చమ్మ పలికింది. తనమీద కాస్త అనురాగము పుట్టిందని గ్రహించి ''నీవు కనబడకపోతే నేను బ్రతుకలేను; అందుకే నీకు నాపై కనికారము రవ్వంతైనా లేకపోయినా, ఇక్కడుంటే నిన్ను జూనుకొని యైనా సంతసించ వచ్చునని మీ యింట సకల చాకిరీ చేస్తున్నాను. నీకొక రహస్యము చెప్పుతాను, కోపము తెచ్చుకోవు కదా? సుబ్బికి ఈ పెళ్ళివల్ల సుఖముండదు సరికదా లుబ్ధావధాని గతించిన తరువాత రామచంద్రపురం అగ్రహారీకులు దానిని చెడగొట్టక మానరు. మీనాక్షి సంగతి చూస్తున్నాము కదా? రామప్పంతులనే పరమ దుర్మార్గుడు అక్కడున్నాడు. వాడెందరు సంసారులనో పాడుచేసినాడు. సుబ్బి తప్పకుండా చెడిపోతుంది.'' ఈలాగు ఒరిసిన పుండుమీద ఉప్పు; జల్లినాడు. ఏ విధముచేనైనా సుబ్బిపెళ్ళి తప్పించవలెననే దృఢాభిప్రాయము బుచ్చమ్మకి కలిగింది.

తిరిగి గిరీశం ''ఇక నీ మాట - ఇప్పుడు తల్లిదండ్రుల చాటున ఖాయిదాగా ఉన్నావు సరే. వీళ్ళు గతించి డబ్బు నీ చేతికి వస్తే నీకూ స్వాతంత్ర్యము కలుగుతుంది. ఉప్పు పులుసూ తిన్న శరీరముగనుక నీ యీడు వాళ్ళందరూ సంసార సుఖమనుభవిస్తూంటే ఎప్పుడైనా నీ కాలు జారక మానదు. ''గిరీశం మాట విని హాయిగా అతనినే పెళ్ళి చేసుకున్నాను కానుకదా'' అని అప్పుడు విచారిస్తావు. నేనో నీవు పెళ్ళిచేసుకొన్నావు కావనే విచారముచేత ప్రాణము మీది ఆశ వదిలి నిన్ను తలుచుకొంటూ పిస్తోలుతో కొట్టుకొని ప్రాణము విడిచి విమానము యెక్కి స్వర్గానికి పోతాను'' అని అనేసరికి ''వద్దు, వద్దు, మీరు కొట్టుకోకండి, అలాగంటే నాకేడుపొస్తుంది'' అని వారించింది. గిరీశం మరికొంత ధైర్యముతో స్వర్గావాసము వర్ణించి, ''మన మిద్దరము స్వర్గములో నున్నప్పుడు నిన్ను పుష్పం లాగు నెత్తిమీద పెట్టుకొంటాను. ఆ సుఖమిప్పుడే కావలెనంటే నా వెంట వచ్చి నన్ను పెళ్లి చేసుకో'' అని నిర్బంధించగా ఇష్టమున్నా తగినంత ధైర్యములేక ''అమ్మ నాయనా! నేను మీ వెంటరాను'' అన్నది బుచ్చమ్మ. కృషి చాలక పోవడముచేత నాల్గో అస్త్రం గురి తప్పింది. ఇంక మిగిలినది - సుబ్బి పెళ్ళి తప్పించడమే. అనంతర ప్రసంగములో అయిదో అస్త్రం ప్రయోగించినాడు.

గిరి : నే నేమైతే నేమి కాని నీ చెల్లెలి మీదైనా నీకు కనికరం వద్దా?

బుచ్చ: ఉండకుండా ఉంటుందా?

గిరీ :ఉంటే దానికీ సంబంధం తప్పించే సాధనం నీ చేతుల్లోనే ఉంది.

బుచ్చ: ఏమి చిత్రమైన మాట! నా చేతుల్లోనా వుంది?

గిరీ : ఒకమాట ప్రమాణ పూర్తిగా చెప్పు. ''నీ చెల్లి పెళ్ళి తప్పించడము నీ చేతనైతే చేస్తావా? నా మీద ప్రమాణం చేస్తే ఆ మాట చెప్పుతాను.

బుచ్చ: మీ మీద ప్రమాణమే. చెప్పండి.

గిరీ : అమ్మయ్యా! ఈ మాట నీతో రహస్యంగా చెప్పుదామని ఎన్నాళ్ళ నుంచో కాచి ఉండగా ఉండగా ఇప్పటికి సమయం చిక్కింది. మీ చెల్లి పెళ్ళి తప్పడానికి ఒకటే సాధనం వుంది, చక్కగా విను. నీవు ముందూ వెనకా ఆలోచించక నన్ను పెళ్ళి చేసుకోవడమే. లేకుంటే పెళ్ళి తప్పదు.

బుచ్చ: నేను మీతో లేచివస్తే నా చెల్లి పెళ్ళి ఆగుతుందా?

గిరీ : నీ చేతనే ఒప్పిస్తాను. మనము పారిపోయిన తరువాత మీ వాళ్ళు నీ కోసము బెంగపెట్టుకొని ప్రస్తుతము పెళ్ళి మానుకుంటారు. నీలాగే సుబ్బి కూడా ఉడాయించి తన కిష్టమున్న వాణ్ని పెళ్ళాడుతుందనే భయముచేత ముసలివాడికి దాన్ని కట్టిపెట్టరు.

ఈ మాటలాడేటప్పుడు బుచ్చమ్మ ముసిముసిగా నవ్వింది. చేప వలలో పడటానికి సిద్ధమైనదని గ్రహించి

గిరీ : నాతో బయలుదేరడానికి నమ్మతమేనా?

బుచ్చ: అమ్మ నాయనా! నా ప్రాణం పోతే మీ వెంట రాను.

''ఏమిది! ఇంత యత్నమూ వృథా అయిందే! ఆతురము కూడదు. కానీ నేను చచ్చిపోతానంటే తన కిష్టములేనట్టు చెప్పింది కదా? ఇప్పుడా అస్త్రము జోడిస్తాను'' అని కృతనిశ్చయుడై.

గిరీ: నీవు రాకపోతే మీ చెల్లెలికి పెళ్ళి తప్పదు, నాకు చావు తప్పదు.

బుచ్చ: అలా అనకండి.

గిరీ : అనకపోతే మాత్రం చావు తప్పేదుందా? నిన్ను విడిచి బ్రతకలేను. అదొక చావు, నా మీద ఒట్టు వేసుకొని మాట తప్పినావంటే నన్నా దేవుడే చంపేస్తాడు, అది రెండో చావు. నాకెలాగు చావు తప్పదు.

బుచ్చ: నా నుంచి మీరు చచ్చిపోతే నేను చచ్చిపోతాను. మీరు చచ్చిపోవద్దు.

గిరీ : నా వశమా? ... అదిగో నీ తమ్ముడు వస్తున్నాడు. మనమిక కష్ట సుఖాలు మాట్లాడుకోవటానికి వీలుండదు, త్వరగా ఒక్క మాట చెప్పు. నన్ను చావమన్నావా? బ్రతకమన్నావా?

బుచ్చ: వెయ్యేళ్ళు బతకండి.

గిరీ : అయితే నా వెంట రావడము ఖాయమేనా?

అప్పుడు బుచ్చమ్మ ఇలాగనుకొని ఉంటుంది: అన్నా! ఏమిసేతును? ఇతడు చెప్పినట్లు చేయకుంటే నిష్కారణముగా ఇతడు చచ్చిపోతాడు, అంతట నేను బతకలేను. ఇతని మాట వింటేనా ఇద్దరమూ హాయిగా బతుకుతాము. సుబ్బిపెళ్ళీ తప్పిపోతుంది. గిరీశంగారు చెప్పినట్లు నే నాతన్ని పెళ్ళాడితే సుబ్బీ నాలాగే చేస్తుందని మా నాన్న దాన్ని ముసలివాడికి కట్టపెట్టరు. అది సుఖపడుతుంది. నేనూ పెళ్ళాడి సుఖిస్తాను. నా చర్యకు మావాళ్ళు నాలుగు రోజులేడుస్తారు అంతే, తర్వాత వాళ్ళూ సంతసిస్తారు. కాబట్టి నేనితని వెంట రామవరం పోవడమే మంచిదని - అని నిర్ధారణ చేసుకొని.

బుచ్చ: ఏం చెయ్యమంటే అది చేస్తాను.

గిరీశం కష్టం ఫలించింది. పాచిక పూర్తిగా పారింది. కార్యసాధనమందు ఎంత చాతుర్యము కవి కల్పించెనో యోచించండి.

బుచ్చమ్మను రామవరము తీసుకొని వెళ్ళినాడే కాని పెళ్ళి చేసుకొనడానికి వీలులేకపోయింది. Widow marriage association వారు వితంతువులను కనబడ్డ వారికల్లా పెళ్ళి చేయరు. భార్యను పిల్లలను పోషించడానికి తగినంత హామీ చూపిస్తేనే కానిపెళ్ళి కానేరదు. బుచ్చమ్మతో బూటకపు మాటలాడినాడే కాని గిరీశం వద్ద సొమ్ము లేదు. ఏదో మాయోపాయముచేసి ధనము సంపాదించవలెను. లుబ్ధావధాని గట్టి చిక్కులలో పడ్డాడు. కూతురు లేచిపోవడానికి సిద్ధంగా ఉంది; పెళ్ళాడిన పిల్ల పారిపోయింది; కూనీ కేసు తలమీద పడింది. రామప్ప కొంప తీసినాడు. కేసు తప్పేమార్గము తోచలేదు. అధికార్లు తనకూ, కూతురికీ ఉరిశిక్ష వేయించడానికి పట్టుబట్టి సాక్ష్యం సరిచేసినారు; తన పక్షాన పల్కేవాళ్ళు లేరు. సౌజన్యారావు పంతులు గారు సాత్వికుడు, ధార్మికుడు, పరోపకారపరుడు; శరణంటే చక్రమడ్డు వేస్తాడు. అతని కాళ్లు పట్టుకొని, ఈ గండము తప్పించుకొని కాశీకి పోవలెనని లుబ్ధావధాని నిశ్చయించుకొన్నాడు. కావలసినంత ధనము ఉన్నా మనిషికి దిక్కులేనందున దీనస్థితి వచ్చింది. ఇట్టి సమయమున అతనికి సాయపడితే ఏమైనా లాభించవచ్చుననే ఆశ కలిగింది గిరీశంకి - ఇంకొటి - సుబ్బిపెళ్ళి ఆగిపోయిందని ఖచ్చితమైన కబురు తెలియనిదే బుచ్చమ్మ పెళ్ళాడనన్నది కాబోలు. ఈ

కారణములచేత గిరీశం రామచంద్రపురం వెళ్ళక తీరింది కాదు. అగ్నిహోత్రుడు తనపైకి తెచ్చిన Abduction కేసు తీసివేసుకొన్నాడు. ఇక భయములేదని ధైర్యం తెచ్చుకొని, లుబ్ధుని వద్ద చేరి, ''అన్నయ్యా! కష్టకాలమందు నీకు సాయపడ వలెనని వచ్చినాను. బుచ్చమ్మను లేవదీసినానే కానీ పెళ్ళాడలేదు. నీవు నన్ను చేరదీసి పెళ్ళి వైభవముతో చేస్తావనే ఆశతో నున్నాను. నీవు ఒంటరివైనావు, తోడు పడేవాళ్ళు నేను తప్ప ఎవరూ లేరు. నాకు లౌక్య వ్యవహారము చక్కగా తెలుసును. నీకు తగిన సాయము చేయుమని సౌజన్యారావుగారు నన్ను పంపినా''రనే సరికి ''నా కెవరి సాయమూ వద్దు, ఎవరి జ్యోక్యమూ వద్దు, అన్నిటికీ ఆ మహారాజే ఉన్నాడు'' అని కసరినాడు. ''పోనీ Power of attorney అయినా ఇయ్యి, నీకే శ్రమా లేకుండా నీ వ్యవహారాలు చక్కబెట్టుతాను. దుర్మార్గుడూ, కపటావతారుడైన రామప్పను నమ్మినావు. కాని ఏ కల్మషమూ లేని బంధువుడను, నన్ను నమ్మకున్నావు. వాడు నీకొంప ముంచుతూనే ఉన్నాడు. పెళ్ళి మానుకో అని పెద్ద ఉత్తరము వ్రాసినాను. నా మాట పెడచెవిని పెట్టకపోతే ఈ చిక్కులు రాక పోను; ఇప్పుడున్న కేసు మాయము చేయిస్తాను. నా మాట విను'' ఈ శ్రమ, హితోపదేశమూ మహా బధిర శంఖారావమయింది. తుదకు సౌజన్యారావు గారిని చూసి నాలుగు కోతలుకోసి లుబ్ధావధానికి తన సాయము చేకూరేటట్టు బందోబస్తు చేయండని ప్రాధేయపడగా ఆ గుంటూరు శాస్త్రి కూటీ బయలుచేస్తే కూనీకేసు పోతుంది. కనుక ఆ ప్రయత్నము చేయమన్నారు రావుగారు. ఈ గిరీశం Social reform లో గట్టిపని చేసినవాడు గనుక పెద్ద మనుష్యుడనిన్నీ, బుచ్చమ్మ నతనికిచ్చి పెళ్ళి చేయవచ్చుననీ అతని అభిప్రాయము.

ఈ సమయమున మధురవాణి రావుగారి దర్శనమునకు వచ్చింది. ఆమె తన గుట్టు రట్టు చేస్తుందని భయపడి గిరీశము రెండర్థము లిచ్చేటట్టు మాటలాడి ''ఒకర్ని కాపాడి ఉపకారం చెయ్యడం ఉత్కృష్టమైన పుణ్యము; చెడ్డవాడినైన నా యెడల మంచిగా ఉండడమే యోగ్యత; అపకారికి నుపకారము నెపమెన్నక చేయువాడె నేర్పరి - '' మధురవాణిని బతిమాలుకొని పోయి పరుండెను. పిమ్మట ఆమె గిరీశం గారి వైఖరి ఉన్నదున్నట్లు చెప్పక తీరింది కాదు. ఆ క్షణమే సౌజన్యారావు అతనిని మధురవాణి ఎదుట మొగము వాచేటట్లు చీవాట్లు పెట్టి, ''నీవు బుచ్చమ్మను పెళ్లాడ తగవని Social reform Association వారికి వ్రాస్తాను. బుద్ధి కలిగి చదువుకొంటే ధనసహాయము చేస్తా''నని చెప్పి తగిలివేసినాడు. ★

# WHAT MAKES AN INJURY UNFORGIVABLE?

Life is filled with all kinds of personal hurts: white lies, broken promises, even physical injuries. Most of the wounds we experience, though, are not unforgivable. We put them behind us and go on. Unforgivable injuries, however, cannot simply be put aside or ignored. They are different from burglaries, muggings, and other attacks by unknown assailants. These damage people, but since they do not involve love, they do not force people to reevaluate their assumptions about love and being loved.

Unforgivable injuries, on the other hand, permanently change the injured parties. There are five major characteristics that make an injury unforgivable:

1. Unforgivable injuries start with a singular event that signals a betrayal.
2. They are initiated by intimate injurers.
3. They are moral wounds; they shatter a person's concept of morality.
4. They assault a person's most fundamental belief systems.
5. They are deeply personal and therefore relative from wounded person to wounded person.

# తెలుగు సాహిత్యం - కొన్ని నిజాలు

- శ్రీ బొమ్మకంటి శ్రీనివాసాచార్యులు

ఆముక్తమాల్యద, మనుచరిత్ర, పారిజాతాపహరణం - ఈ మూడు ప్రబంధాలూ ఆధారంగా చేసుకుని శ్రీకృష్ణ దేవరాయల కాలంనాటి ప్రజలలో కనిపించే రాసిక్యాన్ని గుర్తించేందుకు పూనుకున్న స్వర్గీయ శ్రీ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ తమ వ్యాసం ఆరంభం లోనే వజ్రపు తునుక వంటి ఒక మాట అన్నారు.

**"సత్యమగు విషయమును మాత్రమే చెప్పవలయునను నిర్బంధ మా గ్రంథకర్తలలో నెవరు గాని చేసికొన్నవారు కారు. మఱియు, అనుభవమునకు రానివి, అసత్యములైనవి ఎన్ని విషయములు చెప్పినను వారి నాక్షేపించిన వారా కాలమున లేరు".**

సుమారు రెండు వందల ఏళ్లక్రితం ఉన్న సాహితీ వ్రతులకంటె మన సాహిత్యం పూర్వాపరాలను పరామర్శించుకుని రాగద్వేష విరహితమైన, వస్తునిష్ఠమైన దృష్టితో మన సాహిత్యంలో మంచిచెడ్డలను నిర్ణయించుకునేందుకు అవసరమైన అనుకూల పరిస్థితులు ఈ నాడు మనకు ఎక్కువగా ఉన్నాయి. తెలుగు, సంస్కృతం - రెండే వెనుకటి వారికి తెలుసు. సంస్కృతం స్థాయిని తెలుగు ఎన్నడూ అందుకోలేదనే 'ఆత్మన్యూనతాభావం' (inferiority complex) వారిలో ఉండేది. 'దేశభాషలందు తెలుగు లెస్స' అన్న రాయలవారి సుభాషితం, 'ఆంధ్రత్వ, మాంధ్ర భాషా చ నాల్పస్య తపసః ఫలమ్' అని అప్పయ్య దీక్షితుల వారిచ్చిన ప్రశంసాపత్రం పదే పదే గుర్తు చేసుకుంటూ ప్రపంచంలో సంస్కృతం తరువాత తెలుగు కవిత్వం అంత గొప్పది మరి లేదని బుజాలు ఎగుర వేస్తూ ఉండేవారు. ఈ నాడు మనకు భారతదేశంలోని ఇతర సాహిత్యాలతోనే కాకుండా ఇంగ్లీష్, ఫ్రెంచ్, జర్మన్, రష్యన్ మొదలైన పాశ్చాత్య సాహిత్యాలతోనూ, వాటిలోని కవిత్వపు విలువలతోనూ తగినంత పరిచయం ఏర్పడింది. ఇతర సాహిత్యాల దృష్ట్యా మన తెలుగు సాహిత్యం మంచి చెడ్డలను నిజాయితీతో మదింపు కట్టుకోగల స్థితిలో ఈనాడు మనం ఉన్నాము. ఆ విధమైన విచక్షణ దృష్టితో పరిశీలించి చూస్తే - అవి ఎంత బాధాకరం అయినా - మన వెనుకటి తెలుగు సాహిత్యాన్ని గురించిన మూడు నిజాలను మనం ఒప్పుకోకతప్పదు.

**ఒకటి:** నన్నయ్యమొదలు తిరుపతి వెంకట కవుల దాకా వచ్చిన మన తెలుగు కవిత్వం ఎక్కువ భాగం జమీందారీయుగ కవిత్వమే! సంఘంలో చుట్టూ జరుగుతున్న సంఘటనలకు సజీవంగా ప్రతిస్పందిస్తూ, స్వంత అనుభూతులను స్వంత గొంతులలో ప్రకటించడం గాని, ఉదాత్తాశయాలతో జీవిత సత్యాన్ని అన్వేషిస్తూ, పరిణతాత్ములై తమస్వంత సందేశాలను, ప్రబోధాలను వినిపించడం గాని ఎన్నడూ మన తెలుగు కవులకు ధ్యేయాలు కావు. ప్రభువుల తల లూపించే ఉత్ప్రేక్షలతోనూ, అతిశయోక్తులతోనూ, 'అక్షర రమ్యత, అనబడే శబ్దాలగారడీతోనూ 'కవి' అనే యశస్సు గడించడం, తత్ఫలితంగా ప్రభువుల మెప్పు పొంది అగ్రహారాదులు ఆర్జించుకోడం - ఇవే మన వెనుకటి తెలుగు కవులకు ప్రధాన కవితా ప్రేరణలుగా ఉండేవి.

రెండు: ఇందుకు అపవాదాలుగా ఆత్మ సంతుష్టికోసం, ఆత్మపరిణతి సాధనంగా కవిత్వాన్ని ఉపాసించినవారు - పోతన్న, వేమన్న, గోపన్న, పుసులూరి సోమరాజు, అన్నమయ్య వంటి భక్తకవులు కొందరు కనిపిస్తున్నా, తెలుగులో ప్రథమశ్రేణి కవులుగా వారికి గుర్తింపు లేదు. అదీ గాక - ఆత్మద్రష్టలైన మహాభక్తులై, శిష్యపరంపరను సంపాదించుకొన్న కబీరు, సూరదాస్, తులసీదాస్, మీరాబాయి వంటి హిందీ కవుల స్థాయికి గాని, నమ్మాళ్వార్ (శఠకోపయతి), పెరియాళ్వార్ (విష్ణుచిత్తుడు), తొండరడిప్పొడి యాళ్వార్ (విప్రనారాయణుడు), గోదాదేవి వంటి దాక్షిణాత్య భక్తకవుల స్థాయికి గాని వారు ఎదిగినవారు కాదు. దేవాలయాలలో విగ్రహాలుగా వెలసి, ఆరాధింపబడే ఔన్నత్యానికి వారు నోచుకోలేదు. వారి రచనలు దేవలయాలలో పారాయణ చేయబడే ఉదాత్త స్థాయిని అందుకోలేదు. త్యాగరాజూ, జగన్నాథ పండితుడూ, వల్లభాచార్యులూ, రామానుజాచార్యులూ మన తెలుగువారే అని మురిసిపో జూచినా, వారు తెలుగు గడ్డను వదలి పోయి, అన్య ప్రాంతాలలో మహా కార్యాలను సాధించినవారు; తెలుగు వారిచేత పూర్తిగా విస్మరింపబడి, ఇతర ప్రాంతీయుల స్వంత కాతాలో జమ కట్టుకోబడ్డవారు.

మూడు: ''అల నన్నయ్యకు లేదు, తిక్కనకు లేదా భోగము...'' అని స్వోత్కర్షను చాటుకునే లక్షణం తెలుగు కవులలో ఆధునికుడైన శ్రీవిశ్వనాథతోనే ఆరంభం కాలేదు. 'విపుల శబ్దశాసనుడను,' 'అవిరళజప హోమ తత్పరుడను,' 'నిత్యసత్యవచనుడను,' 'నానా రుచిరార్థ సూక్తినిధిని' అని తనను గురించి తానే ఆత్మ వికత్థనం చేసుకునే ఆచారం ఆదికవి నన్నయనుంచే మనలో ఆరంభమైనట్టు కనిపిస్తుంది. ఆత్మశ్లాఘ, అన్యోన్యశ్లాఘ, తమను కాదన్నవారిని కుకవులని దూషించడం, వస్తునిష్ఠమైన సత్యదృష్టితో చేసే నిష్పాక్షిక విమర్శను సహృదయతతో స్వీకరించగల ఔదార్యం లోపించడం నేటి మన కవులకు మన ప్రాచీన కవులనుంచి వారసత్వంగా సంక్రమించినవే అనడానికి బోలెడు రుజువు లున్నాయి. 'ప్రసన్న కథా కవితార్థయుక్తి', 'అక్షర రమ్యత' సత్కవిత్వ లక్షణాలని నన్నయ గారు నిర్వచిస్తే,'' సొగసు కోర్కులు రావలె అలకించినన్'' అని పెద్దనగారూ, ''పొసగ ముత్తెపు సరుల్ పోహళించిన లీల'' అని పింగాళి సూరన - ఇలా ఎవరికి వారు తమ కవిత్వం ఆధారంగానే కవితా లక్షణం నిరూపించి, అందుకు భిన్నమైనదాన్ని కుకవిత్వం అని త్రోసి పుచ్చారు. ఈ విధంగా తెలుగులో కవులే విమర్శకులైనందువల్ల అందరి కావ్యాలనూ శాస్త్రీయంగా అధ్యయనం చేసి, సర్వాంధ్ర కవిత్వానికీ వర్తించే సాధారణ సూత్రాలను రూపొందించే తెలుగు అలంకారశాస్త్రం అభివృద్ధి పొందే ఆస్కారం లేకుండా పోయింది. తెలుగులో ఉన్న లక్షణ గ్రంథాలు ఇంచుమించు అన్నీ సంస్కృతానికి అనువాదాలే!

మన ఆంధ్ర సాహిత్యాన్ని గురించి ఇలాంటి అప్రియపు మాటలు చెప్పిన వారిలో నేనే మొదటివాణ్ణి కాను. అక్కిరాజు ఉమాకాంత పండితుడు తెలుగు సాహిత్యాన్ని గురించి కొన్ని నిష్ఠురమైన నిజాలు పలికి, సాహిత్య బంధు విరోధి అయాడు. ఇలా ప్రాచీనాంధ్ర సాహిత్యాన్ని గూర్చి నిర్భయంగా కొన్ని ఆక్షేపణలు లేవదీసినవారు మరొకరున్నారు - వేంకట రామకృష్ణ కవులు! 'ప్రాచీనాంధ్రకవుల అపరాధాలు' అనే శీర్షికతో 30 పద్యాలు వ్రాసి భారతిలో వారు ప్రచురించగా, ఆ నాటి ఆంధ్రవిద్వల్లోకంలో అవి గొప్ప సంచలనం కలిగించాయట!

ఆంధ్ర లోకోపకారమ్ము నాచరింప,
భారతమ్మును నన్నయభట్టు తెలుగు
జేయుచున్నాడు సరియె, బడాయిగాక
తొలుత సంస్కృత పద్య మెందులకు చెపుడి''

ఇది వారి మొదటి ఆక్షేపణ. ఇంకొకటి-

''అచ్చతెలుగు పదంబుల నిచ్చకోలది
పుచ్చి, తలతిక్క అన్వయంబులను బెట్టి
పాడుచేసెను నన్నయభట్టు రీతి
ఉభయ కవి మిత్రులష తిక్కయొజ్జ గారు''

ఇంకా వెనుకకు పోతే ప్రజలకు సులభంగా అర్థం కాని సంస్కృత పదభూయిష్ఠమైన శైలిని వరించిన ప్రాచీనాంధ్ర కవులను మొట్టమొదటిసారిగా నిర్భయంగా దుయ్యబట్టినవాడు తెనాలి రామకృష్ణుడు కనిపిస్తాడు. ఆయన చెప్పిన చాటువు ఇది:

''ప్రౌఢ దీర్ఘ సమాస పదముల గూర్చి శ్రీ
నాథుండు కూలార్చె నైషధంబు
దాని తల్లిగ అల్లసాని పెద్దన చెప్పె
ముది మదితప్పి ఆముక్తమాల్య
దూహించి తెలియరాకుండ సూరపరాజు
భ్రమ కళా పూర్ణోదయము రచించె
అతిశ్లేష శబ్ద వాగాడంబరం బొప్ప
పస ఘటించెను మూర్తి వసుచరిత్ర
ఇట్టి కవులకు నేను వాకట్టుకొరకు
చెప్పినాడ మదీయ వైచిత్రి మెరయ
పాండురంగ విజయమును పటిమ దనర-
విష్ణువర్దిష్ణు డగు రామకృష్ణ కవిని''

సత్యమే చెప్పాలనే నియమం మన ప్రబంధ కవులకు లేదని ఆదిలోనే గుర్తించి, అతి జాగరూకతతో తమ పరిశీలనకు ఉపక్రమించిన శ్రీ అనంతకృష్ణ శర్మగారిని కూడా కన్ను గప్పగలిగినంతటి ఐంద్రజాలికులు మన ప్రబంధ కవులు. రాయల కాలంనాటి తెలుగువారి గృహాలను ఇలా వర్ణించారు శ్రీ శర్మగారు: ''ఇవి అన్ని ఋతువులకు అనుకూలముగా, హితముగా నుండునట్లు కట్టినవి. ముంగిటిలో ఇరుప్రక్కల అరుగులు. కంబములపై బొమ్మలు తీర్చియుండురు. గోడలపై చిత్తరువులు; ఎత్తైన మేడలు, అచ్చటనే వెన్నెల సౌఖ్యము లనుభవించుటకు చంద్రశాలలు. ఇంటి కొక పూలతోట, అందు చెంగలువ కొలను, అవకాశ మున్నచో దాని ప్రక్క కృత్రిమముగా తయారుచేసిన కొండ....''.

సరిగ్గా ఇలాంటి ఇళ్లనే సంస్కృతంలో కాళిదాసు మొదలు ఎంద రెందరో కవులు వర్ణించారు.

ఆ సంప్రదాయాన్ని అనుసరించి కాక, రాయలవారు తన కాలం నాటి ఇళ్లనే వర్ణించారని ఏమిటి నిర్ధారణ?

**మరొక సంగతి:** సమకాలీన ప్రజల వేష భాషలూ, ఆభరణాలూ, వంటకాలూ, వేట సామగ్రీ, పశువుల జబ్బులూ, వాటికి మందులూ మొదలైన బాహ్య విషయాలను ఏకరువు పెట్టినంత మాత్రం చేత ఒక కావ్యం ఆ నాటి ప్రజాజీవనాన్ని ప్రతిబింబించిం దని నేను అనలేను. అంతర్దృష్టితో, దార్శనిక నేత్రం (perceptive eye) తో సమకాలీన ప్రజలచైతన్య మూర్తి (ethos) ని దర్శించి జీవితం పట్ల వారి వైఖరిని ప్రదర్శించినప్పుడే ఆ కవి కావ్యంలో సమకాలీన జీవనం నిజంగా ప్రతిఫలించినట్లు! ఆ దృష్టితో చూస్తే మన ప్రబంధా లన్నిటికంటె రాయలకాలం నాటినుంచి అనుశ్రుతంగా వస్తున్న ఒక ప్రజాచాటువు ఆ నాటి ప్రజల మనోవైఖరిని విశదం చేసేది కనిపిస్తూంది. ఒక రాత్రి మారువేషంతో రాయలవారు నగరంలో తిరుగుతూ ఉండగా ఒక చాకలివాడు పాడుకొంటున్న ఈ గీతం ఆయన చెవుల బడిందట:

**"కొండవీడు మనదేరా! కొండపల్లి మనదేరా!**
**కాదని ఎవ్వరు వాదుకు వచ్చిన కటకం దాకా మనదేరా!"**

యుద్ధాలూ, అన్యరాజ్యాక్రమణలూ కేవలం రాజుల రాజ్య విస్తరణ కాంక్షలకే పరిమితం కాక, ఆ నాటి ప్రజలలో కూడా దేశాభిమానం వెల్లివిరుస్తూ ఉండేదని ఈ చాటువు చాటుతూంది.

బ్రిటిష్ వారికంటె ముందు సుమారు 7,8 శతాబ్దాలు మన దేశాన్ని ఏలిన మహమ్మదీయులు బ్రిటిష్ వారంత సౌమ్యులు కారు. వారు చేయని దుష్కృత్యం లేదు. ఆ నాటి వారి ఆగడాలను ఆంధ్రసాంఘిక చరిత్రవ్రాసిన స్వర్గీయ శ్రీ సురవరం ప్రతాపరెడ్డి ఇలా వర్ణిస్తారు:

**"ఓరుగంటిని మంటగలిపిన ముసల్మానులు తెలుగుదేశమంతటా వ్యాపించుకొని తమ ఘోర కృత్యములను నిరాఘాటముగా సాగించిరి" (ఆం. సాం. చ. పుట 308)**

సంస్కృతంలో 'మధురావిజయం' రచించిన గంగాదేవి ముసల్మానుల ఆగడాలను నిర్భయంగా వర్ణించింది:

**"మధురోపవనం నిరీక్ష్య దూయే బహుశః ఖండిత నారికేళ ఖండం ।**
**పరితో నృకరోటి కోటి హార ప్రచలచ్ఛూల పరంపరా పరీతమ్ ॥"**

(మధురానగరంలో కొబ్బరి చెట్ల తలలు నరికి వాటి స్థానంలో తురుష్కులు తాము వధించిన హిందువుల తలకాయలను శూలాలకు గుచ్చి నిలబెట్టారు. ఆ ఉపవనాలను చూస్తూ ఉంటే గుండె చెరువవుతూంది).

**"రమణీయతరో బభూవ యస్మిన్**
**రమణీనాం మణినూపుర ప్రణాదః ।**
**ద్విజ శృంఖలికా బలాత్క్రియాభిః**
**కురుతే రాజ పథః స్వ కర్ణశూలః ॥"**

(ఏ మధురా వీథులు రమణీ మణుల నూపురధ్వనులతో కలకల లాడేవో అవి ఇప్పుడు బ్రాహ్మణుల చేతులకు శృంఖలాలు తగిలించి బలవంతంగా ఈడ్చుకు పోతున్నప్పుడు వినిపించే కర్ణ కఠోరమైన చప్పుళ్లతో నిండి పోయాయి)

**''స్తన చందన పాండు తామ్రపర్ణ్యా**
**స్తరుణీనా మభవత్ పురా యదంభః ।**
**తదసృగ్భి రుపైతి శోణిమానం**
**నిహతానా మభితో గవాం నృశంసైః ॥''**

(ఒకప్పుడు తరుణుల స్తన చందనాలతో ఘుమఘుమ లాడిన తామ్రపర్ణీనది లోని తెల్లని నీళ్లు ఇప్పుడు తురుష్కులు వధిస్తున్న ఆవుల నెత్తురు ధారలతో ఎరుపెక్కి పోయాయి)

తెలుగులోనూ రాయలవారూ, పెద్దనగారూ తురుష్కుల ఆగడాలను స్వల్పంగా స్పృశించకపోలేదు. అయితే వాటిలో పై సంస్కృత శ్లోకాలలోని కరుణ రసం ఎంత వరకు స్ఫురిస్తుందో మీరే చూడండి.

**''సనకాది దివిజ మస్కరి ఫాల గోపిచందన పుండ్రవల్లి కల్ నాకి నాకి''** (ఆముక్త 1-41) అనే సీస పద్యంలో రాయల వారు హిందూ దేవాలయాలలో మహమ్మదీయులు చేసిన దారుణాలు మాత్రమే ఏ మాత్రం ఆవేశం లేకుండా వర్ణించగా, పెద్దనగారు వరూథినిచేత **''గోవధము చేయు తురకల దైవంబవు నీవు''** అని చంద్రుణ్ణి ఉపాలంభింప జేస్తాడు.

తెలుగు ప్రబంధ కవులలో కొంతలో కొంత వాస్తవికతా దృష్టి గల మహాకవులు శ్రీ కృష్ణదేవరాయలు, తెనాలి రామ కృష్ణుడు! ఆ ఇరువురి రచనల నుంచి రెండు మూడు ఆ నాటి ప్రజాజీవన మధుర సన్నివేశాల పదచిత్రాలను మీ ముందుంచి అంతటితో నా వ్యాసం ముగిస్తాను. ఆముక్తమాల్యద లోని ఈ పద్యం చూడండి:

**''తల పక్షచ్ఛట గ్రుచ్చి బాతువులు కేదారంపు కుల్యాంతర**
**స్థలి నిద్రింపగజూచి ఆరెకు లుషస్స్నాత ప్రయాత ద్విజా**
**వళి పిండీకృత శాటులన్ సవి తదావాసమ్ము చేర్పంగ రే**
**వుల డిగ్గన్ వెసబారు వాని గని నవ్వున్ శాలిగోప్యోఘముల్''** (1-65)

చేలు - చేలమధ్య పంట కాలువలు - ఆ కాలువలలో స్నానంచేయడానికి తెలతెలవారుతూ ఉండగానే వచ్చే బ్రాహ్మణులు - చేలలో పంటదొంగతనాలు జరుగకుండా రాజభటులు (ఆరెకులు) రాత్రుళ్లు గస్తీ తిరగడం - చేలలో కాపలాకు మంచెలపై నిద్రించే గొల్ల పడుచులు - ఇదీ దృశ్యం! ఒక రోజున ఏం జరిగిందంటే - ఆ పంట కాలువల ఒడ్డున కొన్ని తెల్లని బాతులు తలలు రెక్కలలోకి ముడుచుకుని నిద్రపోతున్నాయి. రాజ భటులు వాటిని చూసి ''అరే పాపం! ఎవరో బ్రాహ్మణులు వచ్చి స్నానం చేసి తమ తెల్లని బట్టలు పిడుచుకుని ఒడ్డున పెట్టి మరచి పోయి వెళ్లినట్టున్నారు. వాటిని తీసుకెళ్లి ఆ బ్రాహ్మణులకు అందజేద్దాం'' అనుకున్నారు. మెల్లగా రేవులోకి దిగారు. వారి అలికిడికి బాతులు నిద్రలేచి తుర్రుమని నీళ్లలోకి జారుకున్నాయి. పక్క చేలలోనుంచి ఈ తతంగం అంతా చూస్తున్న గొల్ల పడుచులు

కేలికిలా నవ్వారు. ఇలాంటిదే అందమైన పదచిత్రం మరోటి:

"శయ పూజాంబుజముల్ ఘటిన్ తడ బడన్
చందోయి లేగౌనుపై
దయదప్పన్ పసుపాడి పొగడపు
పాదం బొప్ప చెంగల్వ డి
గ్గియనీ రచ్యుత మజ్జనార్థము కటిన్
గీలించి దివ్య ప్రబం
ధ యుగాస్యల్ ద్రవిడాంగనల్ పొలుతు
రుద్యానంపు లోత్రోవలన్" (1-56)

విష్ణుచిత్తుడూ, గోదాదేవీ అవతరించిన శ్రీవిల్లిపుత్తూరు గ్రామం. అక్కడి వైష్ణవాంగనలు గృహ తిరువారాధనలోని పెరుమాళ్ల తిరుమంజనం కోసం మడిగా నీళ్లు తీసుకురావడానికి ఒక ఉద్యానవనం మధ్య ఉన్న ఎర్ర కలువల దిగుడు బావికి వెళుతారు. పసుపు రాసుకుని శిరస్స్నానం చేస్తారు. దేవతార్చనకు రెండు మూడు పూలు త్రుంచుకుంటారు. బిందె నిండా నీళ్లు ముంచుకొని, బిందె చంకనబెట్టుకొని, చేతిలోని తామరపూలు బిందెమీద నాట్యం చేస్తూ ఉండగా, దివ్య ప్రబంధం చదువుకుంటూ ఆ ఉద్యానవనం లోని కాలి బాటలవెంట ఇళ్లకు తిరిగి వెళుతున్నారు. ఆ ద్రవిడాంగనల మనోహర పదచిత్రం ఇది. ఆ యుగ ప్రభావం వల్ల రాయలవారి దృష్టి ఆ ద్రవిడాంగన సన్నని నడుము మీద దయ దప్పిన చన్దోయి మీదికి పోకుండా ఉండి ఉంటే ఈ చిత్రం మరింత హృద్యంగా ఉండేది!

సంస్కృత కవి సమయాల శృంఖలాలనుంచి విడివడి, ఉపమానాలలో, పాత్ర చిత్రణలో, పలుకుబళ్లలో స్వతంత్రతనూ తెలుగు సంఘ వాస్తవికతనూ ప్రదర్శించిన మరొక తెలుగు మహాకవి తెనాలి రామకృష్ణుడు. నిగమశర్మ తండ్రి సభాపతిని వర్ణిస్తూ ఆయన 'వేదముల్ పోసిన గాదె' అని అచ్చతెనుగు రూపకాన్ని వాడే సాహసం ఇతరులలో మనకు కనిపించదు. పాండురంగ మాహాత్మ్యంలోని నిగమశర్మకథ ఆ నాటి మధ్య తరగతి తెలుగు బ్రాహ్మణ కుటుంబ జీవనానికి తీసిన ఒక వార్తాచిత్రం (documentary) లాంటిది. 'నిగమ శర్మ అక్క' అనే ప్రామాణికమైన వ్యాసంలో శ్రీ రాళ్లపల్లి అనంత కృష్ణశర్మ ఆ కథలోని తెలుగు జీవన మాధుర్య ముద్రను కళ్లకు కట్టినట్టు ప్రదర్శించారు.

ఏతావతా - అతిశయోక్తులకూ, ఉత్ప్రేక్షలకూ నిలయం అయిన మన ప్రాచీన ఆంధ్రకవిత్వంలో సమకాలీన జీవన ముద్రకోసం అన్వేషించడం గడ్డివాములో సూదికోసం వెదకినట్టు! ఆధునిక యుగంలో కూడా శ్రీ గురజాడ, శ్రీ ఉన్నవ, శ్రీ విశ్వనాథ వంటి ఇద్దరు ముగ్గురు రచయితలే తెలుగు సంఘ వాస్తవికతను తమ రచనలలో చిత్రింప యత్నించిన వారు కనిపిస్తారు. ప్రాచీన సంప్రదాయాన్ని పాటిస్తూ అన్యభాషానుకరణాలకూ, చౌర్యాలకూ తలపడిన వారే ఎక్కువ! తెలుగు సాహిత్యానికి అభ్యుదయాన్ని సాధించాలంటే రచయితలలో సత్యదృష్టి, వాస్తవికతా దృష్టి పెంపొందడం ఎంతైనా అవసరం! *

# భిన్న మతాలు సామరస్య సూత్రాలు

**- అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి**

కాలం మారుతుందంటారు. కాని మారేది కాలం కాదు, సమాజం. సమాజం మారడం అంటే, పాత మనుషులు పోయి కొత్త మనుషులు రావడం కాదు. సామాజిక సంస్కృతి మారుతుంది. పాత విలువలు పోయి వాటి స్థానంలో కొత్త విలువలు వస్తాయి. మానవ సంబంధాలు విలువలను బట్టి మారిపోతాయి. మరి విలువలు ఎందుకు మారుతున్నట్లు? మానవుని అవసరాలు ఎప్పుడూ ఒకే రకంగా ఉండవు. అవసరాలు తీర్చడం మానవ సహకారంపై ఆధారపడి ఉంటుంది. సహకారం విలువలపై ఆధారపడి ఉంటుంది. విలువల ప్రాతిపదికగా కాకపోతే, అందరి అవసరాలు సమంగా తీరవు. అందుకే మానవ అవసరాలు మారినప్పుడెల్లా, వాటిని తీర్చుకోవడానికి నూతన విలువలు ఏర్పడడం, అలా నూతన విలువలు ఏర్పడినప్పుడెల్ల వాటిమీద ఆదారపడిన సామాజిక సంబంధాలు మారతాయి. కాలం మారడం అంటే ఇదే.

ఆధునిక మానవుని అవసరాలు గత మానవుని అవసరాల కంటె భిన్నాలు. తదనుగుణంగానే ఆధునిక విలువలు రూపొందుతాయి. రూపొందాలి. వాస్తవానికి సమాజం మారినంత వేగంగా, అది ఆధారపడిన విలువలు మారవు. విలువలు ఎప్పుడూ నెమ్మదిగానే మారతాయి. భారతీయ సమాజంలో ఈ వేగాల మధ్య తేడా కొట్టవచ్చినట్టుగా కనిపిస్తోంది. ఈ తేడా ఎక్కువగా ఉండడం ఏ సమాజానికీ మంచిది కాదు. విలువలకు ప్రవర్తనకు సంబంధం లుప్తమైతే సమాజం విచ్ఛిన్న మవుతుంది.

సమాజం మారినంత వేగంగా మతవిలువలు మారలేదు. ఈ ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి మనిషి రెండు మార్గాలు తొక్కాడు. ఒకటి మతపద్ధతి. రెండోది విజ్ఞాన శాస్త్ర పద్ధతి. మతపద్ధతి అంటే, ఈ ప్రపంచంలోని ఏ విషయాన్ని కాని, సంఘటనను కాని వివరించడానికి మరో ప్రపంచాన్ని అంటే ఏ అధిభౌతిక ప్రపంచాన్నో ఆశ్రయించడం. ఈ ప్రపంచంలోని సంఘటనలకు ఆ ప్రపంచం కారణమని చెప్పడం. ప్రతి దానికీ భగవంతుడే కారణమని చెప్పడం. ఇక విజ్ఞాన శాస్త్ర పద్ధతి అంటే, ఈ ప్రపంచంలోని వస్తువులను, సంఘటనలను ఈ ప్రపంచంలోని మరో వస్తువుతో, మరో సంఘటనతో వివరించడం, ఈ ప్రపంచాన్ని వివరించడానికి ఈ ప్రపంచాన్నే ఆశ్రయించడం. ఈ రెండో రకం వివరణ విజ్ఞానశాస్త్రం పెరిగిన తరవాత వచ్చింది. అంతకు ముందు మొదటి రకం వివరణే ఎక్కువగా అమలులో ఉండేది. అలాంటి వివరణతో కూడిన ప్రపంచంలో సమాజం మీద మతం పట్టు ఎక్కువగా ఉండేది.

అసలు ఒకప్పుడు ప్రతి సమాజమూ మతదశ గుండా పయనించిందని ఆగస్టు కోమ్ట్ అన్నాడు. గతంలో మానవ జీవితంలోని ప్రతి అంశాన్ని మతం ప్రభావితం చేసింది. జీవితానికి మతానికి మధ్య సరిహద్దు రేఖను గీయడం సాధ్యం అయ్యేది కాదు. మానవుడు చేసే ప్రతి

పని, ప్రతి సంస్థ మతంతో పెనవేసుకుపోయాయి. అతడి ప్రతి అనుభవానికి మతం తన రంగు పులిమింది. చట్టం, కుటుంబం, రాజకీయం, కళ, ఆర్థిక, వైద్య, విద్య విషయాలు అన్నీ మతంతో ప్రభావితమయ్యాయి. ఏరువాక సాగేటప్పుడు, గృహ ప్రవేశం చేసేటప్పుడు, చివరకు భోజనం చేసేటప్పుడు, స్నానం చేసేటప్పుడు గూడ ఏదో మంత్రం చదవడం, కర్మకాండలుంటాయి. అంతెందుకు మన పెద్దవాళ్ళు ఆవలించినప్పుడు హా! కృష్ణా! అన్నా, పిడుగు పడినప్పుడు అర్జునా! అన్నా అందులో మతం ఉంది. ఇంతగా మనిషి జీవితంతో పెనవేసుకుపోయిన మతం, విజ్ఞానశాస్త్రం అంగలు పంగలుగా పెరగడంతో, లౌకికీకరణ ప్రక్రియ సమాజంలో నెలకొనడంతో, పెనుమార్పులు వచ్చి మానవ జీవితం క్రమంగా మతం నుంచి బయటపడింది. పడుతోంది.

ఈనాటి సమాజంలో ఎవరికీ దయ్యాలు పట్టడం లేదు. పూనకాలు రావడం లేదు. విచలిత ప్రవర్తనను మానసిక రోగ నిపుణులు కుదురుస్తున్నారు. విశ్వాన్ని విజ్ఞానశాస్త్రం, సమాజాన్ని రాజనీతి, సమాజ శాస్త్రాలు వివరిస్తున్నాయి. ప్రపంచం పుట్టుక గురించి మతం చెప్పిన కథలను ఈనాడు ఎవరూ ఎక్కువగా విశ్వసించడం లేదు. ఈ కారణంగా ఒకనాడు రాజ్యం ఏలిన మతం తన పరిధిని తగ్గించుకొని, పరిమిత క్షేత్రంలో పనిచేస్తూ, ఇతర సంస్థలతో పోటీపడే స్థితికి దిగజారింది. విశ్వాసం మీద మతం తన గుత్తాధిపత్యాన్ని కోల్పోయింది. దేనిని నమ్మాలో, దేనిని నమ్మగూడదో వితర్కించుకొని, ఎంచుకొనే అవకాశం ప్రజలకు లభించింది.

లౌకికీకరణం మతదృక్పథాల్లో చాలావరకు మార్పు తెచ్చింది. మతాల దృష్టి, ఇప్పుడు కేవలం దేవుళ్ళకే కాక మనుషులకు గూడ ప్రాముఖ్యాన్ని ఇస్తున్నది. దేవుని మీదినుంచి మనిషి మీదికి దృష్టి మరలింది. మనిషిని కేంద్రంగా చేసుకొని మానవవాదం ప్రాముఖ్యం సంతరించుకొంది. మతం విషయంలో గాంధీ తెచ్చిన మార్పును చూస్తే మనకు ఈ విషయం స్పష్టమవుతోంది. సమకాలీన భారతీయ తత్వం అనే గ్రంథానికి వ్యాసం రాయమని, రాధాకృష్ణ పండితులు గాంధీజీకి మూడు ప్రశ్నలు పంపారు. మీ మతం ఏమిటి? దానిని మీరు ఎలా చేరుతున్నారు? సమాజంపై దాని ప్రభావం ఏమిటి? అనేవి ఆ మూడు ప్రశ్నలు. ఆ ప్రశ్నలకు గాంధీజీ సమాధానం చెబుతూ, ''నేను ఇంతకు ముందు విష్ణు సహస్ర నామం చెప్పుకొనే వాణ్ణి. దాని మానివేశాను. ఇంతకుముందు 'దేవుడే సత్యమని' చెప్పే వాణ్ణి. ఇప్పుడో ''సత్యమే దేవుడు'' అని చెబుతున్నాను. దేవుడు లేడన్న వారున్నారు. సత్యాన్ని కాదన్న వారు లేరు. నా సత్యాన్ని , నా ముక్తిని మానవళికి సేవ చేయడంలో చూస్తున్నాను. జీవన సముద్రంతో తాదాత్మ్యం చెందడంలో, దానిలో మునిగి పోవడంలో దానిని దర్శిస్తున్నాను.'' అన్నారు. దీనిని బట్టి గాంధీజీ దృక్పథంలో వచ్చిన మార్పు మనకు అర్థమవుతోంది. దేవుని కంటె మనిషి ప్రాముఖ్యం సంతరించుకొన్నాడని అర్థమవుతోంది. అంత మాత్రం చేత మతానికి భవితవ్యం లేదని నా ఉద్దేశం కాదు.

ఆధునిక సమాజం వేగంగా మారిపోతోంది. ఆధునికీకరణం, సంస్కృతీకరణం, పాశ్చాత్యీకరణం, పారిశ్రామికీకరణం, లౌకికీకరణ ప్రక్రియలు, సమాజాన్ని పరివర్తితం చేస్తున్నాయి. ఫలితంగా నూతన విలువలు పాదుకొంటున్నాయి. ప్రజాస్వామికం, వ్యక్తిక స్వేచ్ఛ, లౌకికత, సమత, మానవత, హేతుత్వాలు, ఆధునిక విలువలుగా రూపొందాయి. ఆధునిక మానవుడు ఏ విలువలు పాటిస్తే ఆధునిక మానవుడవుతాడు? అతడు నూతన భావాలకు స్వాగతం

పలకాలి. నూతన పద్ధతులను ప్రయోగించి చూడాలి. ఏ విషయం మీదనైనా అడిగీ అడగక ముందే తన అభిప్రాయాలను వెలువరించే వాడుగా ఉండాలి. గతాన్ని గురించి కాక ప్రకృతాన్ని, భవిష్యత్తును గురించి మాత్రమే అతడు ఆలోచించాలి. సమయపాలన అంటే పంక్చువాలిటీని పాటించాలి. ప్రణాళికలు వేసుకోవాలి. ప్రతిదానినీ వ్యవస్థీకరించుకోవాలి. సామర్థ్యం ముఖ్యం. ప్రపంచాన్ని అర్థం చేసుకోగలం - కూడికలు తీసివేతలతో గణించగలనని అతడు భావించాలి. విజ్ఞాన, సాంకేతిక శాస్త్రాలలో అతనికి విశ్వాసం ఉండాలి. అందరికీ ఒకే న్యాయం అనే సూత్రాన్ని అతడు విశ్వసించాలి. - ఈ విలువలను విశ్వసించే ఆధునిక మానవుడు ఎక్కడ? సనాతన ధర్మం, అదిభౌతికతలు, సమిష్టులతో కూడిన గతకాలపు నిచ్చెనమెట్ల భారతీయ సమాజం ఎక్కడ? ఈ ఆధునికత విసరే సవాలుతో అసమతల నుంచి సమతకు, సమిష్టి నుంచి వైయక్తికతకు, అభంగత నుంచి చారిత్రకతకు, ఆ లోకం నుంచి ఈ లోకానికి, అధిభౌతికత నుంచి లౌకిక హేతుత్వాలకు, దేవుని నుంచి మానవునికి మారే ప్రవృత్తి ప్రస్ఫుటమవుతోంది.

ఈ పరివర్తనాపథంలో విభిన్న మతాల పరిస్థితి ఏమిటి? అవి వాటి వైలక్షణ్యాలతో విభిన్న దృక్పథాలను ప్రచలిస్తుంటే, అవి మనుషులను చీలుస్తుంటే, ఒకరిపై ఒకరిని ఎగదోలుతుంటే, విషజ్వాలలను కక్కిస్తుంటే, మన కర్తవ్యం ఏమిటి? మారుతున్న కాలానికి అనుగుణంగా మతాల మధ్య సామరస్య సాధన ప్రయత్నం ఎంతో అవసరం. దీనికి ప్రాతిపదికగా మతావగాహన అవసరం. మతం అంటే సరైన అవగాహన ఉంటే ఏ మతమూ తాను ప్రవర్తించుచున్న రీతిలో ప్రవర్తించదు. అవగాహన ఉంటే పొరపొచ్చేలు రావు ఇతర మతాల గురించి కాకపోయినా, చాలామందికి తమ మతాన్ని గురించి గూడ సరైన అవగాహన లేదు. తమ మతం ఏమి చెప్పింది, ఇతర మతాలు ఏమి చెప్పాయియో తెలుసుకొంటే ఇటువంటి అవాంఛనీయ పరిస్థితులను పరిహరించవచ్చు. కనుక మొదటి సామరస్య సాధనా సూత్రం తమ, పర మత వాస్తవ అవగాహన. దీనికిగాను, ఆ మతాన్ని ఈ మతాన్ని గురించి తెలుసుకోవడం కాక, అసలు మతం అంటే ఏమిటి, మనిషికి దాని ఆవశ్యకత ఏమిటో తెలుసుకొంటే సరిపోతుంది. మతం లేకుండా మనిషి బ్రతకలేడా? మతాలను మామూలుగా మనం చూసే సంకుచితార్థంలో కాక సార్వత్రికంగా సార్వజనీనికంగా చూడడం ఎలా? అనే ప్రశ్నలకు సమాధానం చెప్పుకోవాలి.

మతం అనగానే మనకు దేవుడు, పూజ, కర్మకాండ, గుడి, పరలోకం, ముక్తి పవిత్ర గ్రంథం, పూజారి, విగ్రహం, ప్రతీకలు గుర్తుకు వస్తాయి. ఇవన్నీ మనం అన్ని మతాలకు ఉన్నాయని చెప్పడం లేదు. కొన్ని మతాలకు కొన్ని ఉంటాయి. మరి కొన్నింటికి కొన్ని ఉండవు. బౌద్ధానికి దేవుడు లేడు. ఆ తరవాత బుద్ధుణ్ణి, ఆయనకు ఇష్టం లేకపోయినా, దేవుణ్ణి చేశారు. అది వేరే సంగతి. అలాగే మానవవాద మతానికీను. మతాల్లో కొన్ని అధికారిక మతాలు. అంటే వీటిని ప్రశ్నించడానికి వీలులేదు. ఇదే వాటి బలహీనత, బలమూన్నూ. మరికొన్ని మతాలు హేతువాద మతాలు, మానవతా మతాలు. అందుకని అందరూ అంగీకరించే మత నిర్వచనం చెప్పడం చాలా కష్టం. అయితే మామూలుగా చెప్పాలంటే, మానవుని జీవితానికి ఒక అర్థాన్ని కల్పించి, దానికి సార్థకతను, సాకూతతను చేకూర్చే వేరొక ఆదర్శ ప్రపంచం ఉందని భావించి, దానికి మనిషి చేసే ప్రతిస్పందనే మతం. భక్తి సమన్వితమైన అతని భయాన్ని, గౌరవాన్ని, విశ్వాసాన్ని రేకెత్తించే ఆ అదృశ్య ప్రపంచానికి

అతడు కావించే ప్రతిస్పందనే మతం. మరో విధంగా చెప్పాలంటే, మతం ఒక ఆలోచనా విధానం. జీవితానికి సాంత్వనాన్ని, అర్థాన్ని చేకూర్చే ఉద్వేగపూరిత ఆలోచన.

మానవునికి మానసికంగా భద్రత కావాలి. దేని మీదో ఒకదానిమీద అతడు వాలాలి. అది ఏదైన కావచ్చు. అదృశ్య ప్రపంచం కావచ్చు. ప్రేమ కావచ్చు. జ్ఞానం కావచ్చు. ఒక ఆదర్శం కావచ్చు. దానికి అతడు తనను తాను అర్పించుకొన్నప్పుడు, దానిలో అతడు తనను తాను పోగొట్టుకొన్నప్పుడు, భద్రతను పొందుతాడు. తన అస్థిర, పెళుసు జీవితానికి ఒక అర్థాన్ని సాకూతతను పొందుతాడు. అందుకని మతం మానవ అంతర్గత అవసరం. అందుకని మనిషికి మతం అవసరమా కాదా అనే ప్రశ్న అర్థరహితం.

అయితే మనిషికి ఎటువంటి మతం కావాలి? అనేది అసలు ప్రశ్న. మానవ జీవితం ఎదుర్కొనే ఎటువంటి నూతన సమస్యలకైనా సమర్థవంతంగా, సృజనాత్మకంగా ప్రతిస్పందించగల మతం కావాలి. అలాంటి మతమే ఆరోగ్యకరమైన మతం అవుతుంది. ఆ పనిచేయలేని మతం పతనోన్ముఖమైందన్న మాటే.

ఎన్నో మతాలు ఉన్నాయి. వీటిలో ఒక దానికి మరొక దానికి పొసగనితనం ఎందుకు ఉత్పన్నమవుతున్నది? ఈ కారణాలు తెలిస్తే మత సామరస్య సాధన సులువైనట్లే.

అసలు మతానికి సాక్ష్యం ఏమిటి? ఆధ్యాత్మికానుభవం. ఈ ఆధ్యాత్మికానుభవం ఎలా ఉంటుంది? అనుభవించ వలసిందే తప్ప మాటల్లో చెప్పడానికి వీలులేనిది. ఆధ్యాత్మికానుభవ అస్తిత్వ లక్షణం వివరించడానికి ఏభాష చాలదు. ఆధ్యాత్మికానుభవ అస్తిత్వ లక్షణం అంటే, ఆత్మ దాని లోతుల్లోకి వెళ్ళి, తన భూమికను, వాస్తవికతను దర్శించినప్పుడు అది పొందే అనుభవం. ఇది అసలు మతానికి చరమ సాక్ష్యం. ఏ మతం చెప్పినా, ఏఋషి, ప్రవక్త చెప్పినా అసలు వాస్తవం ఇదే. ఈ వాస్తవాన్ని కేంద్రంగా చేసుకొంటే, దీనిని విస్మరించకుంటే భిన్న మతాలు ఘర్షించుకోవు.

కాని జరుగుతున్నది వేరు. అసలు విషయం మరుగునపడిపోయి, ప్రవక్తలు, ఋషులు, ధర్మాధికారులు ప్రాముఖ్యం సంతరించుకొని వీరే దేవుళ్ళై పోతున్నారు. దేవుడు ఎన్నుకొన్నాడని చెప్పబడుతున్న ఋషులు, ప్రవక్తలు దేవుని స్థానాన్ని ఆక్రమిస్తున్నారు. అసలు దేవునికంటె అతడిని పూజించే విధానం సూత్రాలు ముఖ్యమయ్యాయి. వీటి మీద జనం వాదోపవాదాలు చేసుకొంటున్నారు. పూజా విధానాలు, విగ్రహాలు, ప్రవక్తల మధ్య తగవులు చోటు చేసుకొన్నాయి.

మనం గమనించాల్సిన మరో విషయం, మతం వ్యవస్థీకృతమైన కొలది, వ్యక్తికి స్వేచ్ఛ ఉండదు. అలాంటప్పుడు వ్యవస్థ, దాని నాయకులు ఆరాధ్యులవుతారు.

మతం సార్వత్రికం కాకుండా, కేవలం ఒక సంస్కృతికో, ఆలోచనా విధానానికో పరిమితమైనప్పుడు అన్ని రకాల తేడాలు వస్తాయి. ఒక సంస్కృతికి పరిమితమైన మతానికి మరో సంస్కృతికి పరిమితమైన మతానికీ విభేదాలు వస్తాయి. ఎందుకంటె ఆ రెండు సంస్కృతుల విలువల్లో తేడాలున్నాయి.

మత సామరస్యం కావాలంటే, అసలు విషయాన్ని విస్మరించి, మతాధికారులు, వ్యవస్థ, పూజా విధానం, ఒక సంస్కృతికి పరిమితం కావడం లాంటివి ప్రాముఖ్యాన్ని వహించరాదు.

తరువాత ఏ మతమూ తనకు తెలిసిందే సవ్యమైందనీ, తన దేవుడే గొప్పవాడనీ భావించరాదు. అసలు ఇలాంటి భావన ఇంతకుముందు చెప్పిన పరిచ్ఛిన్నతల కారణంగానే వస్తుంది. అందుకని ఇంతకు ముందు చెప్పిన ''ఆత్మ అస్తిత్వానుభూతి''ని దృష్టిలో ఉంచుకొంటే మతాల మధ్య వేరుతనం భావన రాదు. ఈ అనుభూతి క్రైస్తవం కాదు, హైందవం కాదు, యూదీయం కాదు. ఇస్లామీయం కాదు.

ప్రపంచంలో కెల్ల ''క్రైస్తవ మార్గమే మంచిది'' అని ఒక అమెరికన్ గాంధీజీకి రాస్తే ''మీకు అందరిని గురించి తెలుసుననుకొంటున్నారు. మీరు దేవుడైతేనే అలా తెలుస్తుంది. మీరు రెండు దోషాలకు పాల్పడుతున్నారని నేననుకొంటున్నాను. ఒకటి: మీరు ఏది మంచిదని మీరనుకొంటున్నారో అది వాస్తవంగా మీరు మంచిదనుకోవడం. రెండోది మీకు ఏది మంచిదని మీరు భావిస్తున్నారో అదే ప్రపంచానికంతా మంచిదనుకోవడం. అవి సర్వజ్ఞుడు చెప్పాల్సిన మాటలు. నేను అంత సాహసం చేయలేను. నేను కొంచెం వినమ్రుడుగానే ఉండాలనుకొంటున్నాను''. అన్నారు గాంధీజీ.

ప్రపంచంలో భిన్న మతాలున్నాయి. వాటి మధ్య తేడాలు లేవనడం సరికాదు. అన్ని మతాలు సహజీవనం సాగించాలంటే, తమ విశిష్ట లక్షణాలను గురించి కూడ సార్వత్రిక ఆధ్మాత్మిక భావనను గుర్తించాలి. మానవ యజ్ఞంలో అన్ని మతాలు భాగస్వాములు కావాలి. తమ మధ్య తేడాలను భాగస్వామ్యాన్ని బలపరచుకోవడానికి వినియోగించుకోవాలి. దీనికి మానసిక సంయమనం సాధించాలి. ప్రపంచ విశ్వాసాన్ని, మైత్రీ స్ఫూర్తితో పెంపొందించాలి. పారమార్థిక ఆధ్యాత్మిక సత్యాన్ని విశ్వసించే వారంతా స్వేచ్ఛాయుత సహకారాన్ని అవలంబించాలి. మనం ఏ మతానికి చెందిన వారమైనా దేవుని కుటుంబంలో సభ్యులమే అని గుర్తుంచుకోవాలి. ఈ దేవునికి మీరేమైనా అర్థం చెప్పుకోండి.

విజ్ఞానశాస్త్రం క్రమంగా విశ్వరహస్యాలను ఛేదించి నమ్మదగిన వివరణలు ఇస్తోంది. అందుకని మతం పాత్ర కుంచించుకుపోయి, క్రమంగా అది అంధవిశ్వాసంగా అంతిమంగా అంతరిస్తుందని చాలామంది చాల సంవత్సరాలుగా భావించారు. దీనిని ఏ మేధావి అంగీకరించడు. విశ్వావగాహనలో విజ్ఞానశాస్త్రం ఎప్పటికీ పూరించలేని ఖాళీలు ఉంటాయి. జీవితార్థాన్ని, ప్రయోజనాన్ని, లక్ష్యాన్ని విజ్ఞానశాస్త్రం ఎప్పటికీ వివరించలేదు. ఆ పనిని మతం మాత్రమే చేస్తుంది. కాకపోతే మతం తన సనాతన, అధికారిక, విశ్వాసాలను కాలానుగుణంగా మార్చుకొని తనను తాను ఎప్పటికప్పుడు పునర్నిర్వచించుకోవాలి. ★

ఆకాశవాణి సౌజన్యంతో

DIVINE DARKNESS **FITNOTES**

Tamaso ma jyotirgamayah - beseeched the Vedas. Light in its figurative and materialistic sense sharpens and enhances our vision. But not so any more, at least on the material level. According to a new book, The Body Almanac, published by Washington's National Library of Medicine, the world's largest library on medical sciences, theat the more we remain in the dark, the more our vision sharpens. And it is not by any fragile figure. By staying in the dark for about 40 minutes anyone can increase eyesight by 25,000 times. So why not pray for darkness instead of light?

# 20వ శతాబ్దపు తత్వవేత్త
# బెర్ట్రాండ్ రస్సెల్ (1872 - 1970)

- డా॥ ఎన్. ఇన్నయ్య

బెర్ట్రాండ్ రస్సెల్ తనకు అత్యంత ప్రీతిపాత్రమైన గణితాన్ని వదలేసినప్పుడే, మొదటి భార్య ఎలిస్‌ను కూడా వదలేశాడు. ఈ రెండింటికీ ఏదైనా సన్నిహిత సంబంధం వున్నదేమో చూడమని కార్ల్ పాపర్ వ్యాఖ్యానించాడు. 20వ శతాబ్దంలో అత్యంత ప్రాధాన్యత వహించి, బహుళ ప్రచారం పొందిన రస్సెల్ అందరి తత్వాలను అవలీలగా గ్రహించి అరటిపండు ఒలిచి పెట్టినట్లు మనకు చెప్పేశాడు. కాని ఆయన తత్వం గ్రహించడం, ఇతరులకు సులభంగా చెప్పడం ఏమంత తేలిక పని కాదు. రస్సెల్ ఎక్కువమంది నోళ్ళలో నానడానికి ఆయన తత్వం కారణం కాదు. తాత్వికేతరంగా అనేక సామాజిక, రాజకీయ విద్యా సంబంధమైన విషయాలు విడమరచి చెప్పినందువలన ప్రపంచ వ్యాప్తంగా రస్సెల్ చిరపరిచితుడయ్యాడు.

తత్వశాస్త్రంలో రస్సెల్ తొలుత గణితంతో, తర్కంతో నాంది పలికాడు. ఇవి రెండూ జటిలమైనవే. రెండువేల సంవత్సరాలుగా దుంప తెంచుతున్న జటిల సమస్యల్ని గణితంలో పరిష్కరించి, రస్సెల్ దారి చూపాడు. కచ్చితంగా నిర్దుష్టంగా ప్రతిపాదనలు వుండాలనే దృష్టితో తర్కానికి గణితాన్ని వినియోగించాడు.

రస్సెల్ 60 పుస్తకాల వరకూ, అణ్వాస్త్రాలతో సహా అనేక విషయాలు చర్చిస్తూ రాశాడు. అందులో కొన్ని సాంకేతికంగా జటిలంగా వుంటాయి. చరిత్రకే పనికొచ్చేవి కొన్ని వుండగా, నేటికీ విలువ యివ్వదగిన అంశాలు మరికొన్ని కనిపిస్తాయి. ఆధునిక తత్వానికి రస్సెల్ ఆద్యుడు. తన రచనల్ని ముఖ్యంగా తాత్విక చింతనను-ఎప్పటికప్పుడు పునః పరిశీలన చేస్తూ, రాస్తూపోయాడు. భావాలలో మార్పు చేసుకున్నాడు. తన తాత్విక పరిణామాన్ని తానే చెప్పాడు. అందువలన మన కృషి సులభం అయింది.

ఇంగ్లండులోని ఉన్నత రాజకుటుంబంలో పుట్టిన (1872) రస్సెల్, కేంబ్రిడ్జి విశ్వ విద్యాలయంలో గణితం, తత్వం అధ్యయనం చేశాడు. ప్రాచీన కాలం నుండీ వస్తున్న చలన సమస్యకు రస్సెల్ అద్భుత పరిష్కారం చూపాడు. 2400 సంవత్సరాలుగా పీడించిన అర్థం లేని సంఖ్య (irrational number) అనే సమస్యను పరిష్కరించి పెట్టాడు. గణితంలో ఎంతో కృషి చేసిన రస్సెల్ 1900లో పారిస్ సెమినార్‌కు వెళ్ళినప్పుడు ఫ్రెజీని, పియానోను కలుసుకున్నాడు. అంతవరకు తాను తిప్పలు పడుతున్నదంతా జర్మనీలో ఫ్రెజీ (Frage) రాసేసినట్లు తెలుసుకొని ఆశ్చర్యపోయాడు. బయట ప్రపంచానికి తెలియకుండా జెనా విశ్వ విద్యాలయానికే పరిమితమైన ఫ్రెజీ (1848-1925) రచనల్ని రస్సెల్ చదివాడు. ఫ్రెజీ గొప్పతనాన్ని రస్సెల్ చాటాడు. వైట్‌హెడ్ , రస్సెల్ యిరువురూ కలసి ప్రిన్సిపియా మాథమెటికా గ్రంథం వెలువరిస్తూ ఫ్రెజీ విశిష్టతను బయటపెట్టారు. గణితంతో కూడిన తర్కం అప్పటి నుండే చాలా ప్రాధాన్యతలోకి వచ్చింది. గణితాన్ని తర్కానికి లొంగి వుండేటట్లు చేయాలని జర్మనీలో ఫ్రెజీ, ఇంగ్లండులో రస్సెల్ తలపెట్టి విఫలం చెందారు. అయితే ఫ్రెజీ సిద్ధాంతాల

పట్ల రస్సెల్ కొన్ని సందేహాలు వ్యక్తపరచాడు. మరికొన్ని విమర్శలు చేశాడు. గణితంలో సర్వసాధారణంగా పిల్లలు నేర్చుకునే సెట్స్ విధానం, రుజువుపరచే తీరు ఫ్రెజీ చూపాడు. సంఖ్య వున్నా లేకున్నా అన్నిటినీ సెట్స్ (sets) గా విభజించిన పద్ధతిని రస్సెల్ విమర్శించాడు. ఫ్రెజీకి రాశాడు. ఫ్రెజీ తర్కంలో రస్సెల్ చూపిన లోపం చాలా తీవ్రమైనది. ఫ్రెజీ సమాధానం చెప్పలేకపోయాడు.

గణితంలో, తర్కంలో దూసుకపోయిన రస్సెల్‌కు ఎదురు రాయి తగిలింది. నిర్దుష్టత కోసం పట్టుబట్టిన రస్సెల్ సందేహంలో పడ్డాడు. పరస్పర విరుద్ధాలు ఎదురైనప్పుడు ఎలా పరిష్కరించాలనే విషయమై పదేళ్ళ పాటు సతమతమయ్యాడు. తొలుత యీ పరస్పర విరుద్ధాలనేది (paradoxes) చాలా స్వల్ప సమస్యగా భావించాడు. దానిపై కాలం వృథా చేయడం అర్థం లేనిదనుకున్నాడు. కాని, దిగి చూస్తేగాని లోతు తెలియలేదు. ఎంత తల బద్దలు కొట్టుకున్నా ముందుకు సాగలేక, విసిగి, గణితం పట్ల విరక్తి చెందాడు. మానవ జ్ఞానానికి నిర్దుష్టంగా ప్రాతిపదికలు చూపాలని ప్రయత్నించిన రస్సెల్, ఆ ప్రయత్నానికి స్వస్తి చెప్పాడు. పరస్పర విరుద్ధం అనేది అతడిని సాగిపోనివ్వక పోవడమే యిందుకు కారణం. ఒక కాగితంపై ''ఒక వైపున రాసింది అబద్ధం'' అని పేర్కొన్నామనుకోండి. మరో వైపున ''రెండో వైపు రాసింది నిజం'' అన్నామనుకోండి. ఏ ఒక్క ప్రకటన నిజమనుకున్నా ఆ మాట అబద్ధం అని తేలుతుంది. ఇది విప్పిచూస్తే స్వల్ప విషయంగా కనిపిస్తుంది. తార్కికంగా యీ సమస్యను పరిష్కరించాల్సిన రస్సెల్, చిక్కుముడిగా భావించి, కొట్టుమిట్టాడాడు. అబద్ధమో, నిజమో ఏదో ఒకటి కచ్చితంగా తేలిపోవాలని, రస్సెల్ ప్రతి విషయాన్ని గురించీ భావించాడు. రస్సెల్ సిద్ధాంతం తొలుత ఆకర్షణీయంగా వున్నా, ఇందులోని లొసుగుల్ని పీటర్ స్ట్రాసన్ ఎత్తిచూపి, విమర్శించాడు.

తత్వం అంటే ప్రపంచాన్ని అవగాహన చేసుకోవడమేనని రస్సెల్ భావించాడు. ఇందుకుగాను ఏం చేయాలో మార్గాలు చూపాడు. ఇందులో సామాన్యుడికి అర్థం కాని సాంకేతిక సిద్ధాంతాలు కూడా వుంటాయన్నాడు. శాస్త్రీయాధారాలు, తాత్విక వాదనలు యీ విషయాన్ని రుజువు చేస్తున్నాయన్నాడు. వైట్‌హెడ్ తో కలిసి రస్సెల్ 3 సంపుటాలుగా రాసిన గణిత శాస్త్రంలో యావత్తు లెక్కల్ని కేవలం కొన్ని ప్రాథమిక సత్యాల ఆధారంగా రాబట్ట వచ్చునని చూపారు. తార్కికంగా సంఖ్యను నిర్వచించారు. తర్కంతో ప్రతిపాదనల్ని వివరించారు. మనం సర్వసాధారణ భాషగా భావించే వాటి వెనుక తవ్వి తీస్తే కార్య కారణ సంబంధమైన వ్యాకరణం వుంటుందని రస్సెల్ ఉద్దేశం. కనుకనే యీ విషయాలను వివరించడానికి తర్కాన్ని వాడుకొన్నాడు. కొత్త సిద్ధాంతాలకు దారితీసే యీ పద్ధతిని రస్సెల్ చూపాడు.

తాత్విక పరిణామ దృష్ట్యా రస్సెల్ రాసిన ఉత్తమ తొలి రచనగా లెబ్నిజ్ తత్వాన్ని చూపవచ్చు. మనం మాట్లాడే సాధారణ భాష వెనుక అంతర్లీనంగా వాక్య నిర్మాణం, వ్యాకరణం యిమిడి వున్నాయనేది లెబ్నిజ్ నుండే రస్సెల్ గ్రహించాడు. ఈ తర్కాన్ని కొనసాగిస్తే క్రమ పద్ధతిలో ప్రపంచాన్ని గురించి అవగాహన ఏర్పడుతుందన్నాడు.

ఆధునిక పదార్థవిజ్ఞానం తెలియాలంటే గణితం తప్పదని రస్సెల్ భావించాడు. తర్కాన్ని, జ్ఞాన సిద్ధాంతాన్ని వినియోగించి, మౌలికమైన ప్రతిపాదనలకు రస్సెల్ దారి తీశాడు. అనుభవం వలన యీ మౌలిక విషయాలు గ్రహిస్తాం. వాటితో మొదలుపెట్టి ముందుకు నడవాలన్న మాట. రస్సెల్ తన తాత్విక పరిణామాన్ని వ్రాసుకొన్నాడు. తార్కిక అణువాదం అందులో ఒక దశ అని పేర్కొన్నాడు. తత్వంలో ప్రతిపాదనలను విశ్లేషించాలని, అంతర్లీనంగా ఏముందో కనుగొనాలని రస్సెల్ ఉద్దేశం. ఇందుకుగాను వాక్య నిర్మాణం ప్రాపంచిక అనుభవ జ్ఞానంతో వివిధ రకాల మధ్య సంబంధాలు చూడాలన్నాడు. ఈ పని తత్వమే చేయాలన్నాడు. అలా విశ్లేషించినప్పుడు స్పష్టత బయట పడుతుం

దని, ఇది విశ్వవ్యాప్తంగా అన్ని భాషల్లో వుంటుందని రస్సెల్ అభిప్రాయం. దీనికే తత్వం కనుగొనాలం టాడు.

రస్సెల్ స్పష్టంగా రాస్తాడు. రాజకీయాలు, విద్య, నీతి, మనోవిజ్ఞానం గురించి అలాగే రాశాడు. అవి జనాకర్షణ పొందాయి. 1950లో సాహిత్యంలో రస్సెల్‌కు నోబెల్ బహుమతి లభించింది. అతడి రచనలలో ఉత్తరోత్తరా పేర్కొనదగినవి: అవర్ నాలెడ్జ్ ఆఫ్ ది ఎక్స్‌టర్నల్ వరల్డ్, ది ఇంక్వైరీ ఇన్‌టు మీనింగ్ అండ్ ట్రూత్, మేరేజ్ అండ్ మోరల్స్, ప్రాబ్లమ్స్ ఆఫ్ ఫిలాసఫీ, ఎనాలసిస్ ఆఫ్ మైండ్ , ఎనాలసిస్ ఆఫ్ మాటర్, పవర్ మొదలైనవి.

సంప్రదాయ సంస్థల్ని, వివాహాలను, ఆచార వ్యవహారాలను దుయ్యబట్టిన రస్సెల్, తోడు కోసం పెళ్ళి చేసుకోవచ్చనీ, నగ్న సాహిత్యం అనుమతించాలనీ, బాల బాలికలు నగ్నంగా వుండడంలో తప్పులేదు గనుక ప్రోత్సహించాలనీ అన్నాడు.

మన చుట్టూ వున్న లోకం అమానుషంగా, వైమనస్యతకు దారి తీసేదిగా వున్నదని రస్సెల్ అభిప్రాయం. అనేక సమస్యలు పరిష్కారం కావని, అంతమాత్రాన దిగజారిపోకుండా, సత్యం, సుందరం అనేవి గ్రహించి, అభినందించాలన్నాడు. మరణం చివరి దశ అంటూ, మరణానంతరం ఏదీ లేదన్నాడు. సహచర్యంలోనే ఆనందం వున్నదని, అందులోనే వ్యక్తిగత ఆనందాన్ని దాటిపోయే అవకాశం కనిపిస్తుంద న్నాడు. జీవితంలో ఒడిదుడుకులు, సుఖ దుఃఖాలు వున్నాయంటూ, మన ఆనందం, విచారంతో ప్రపంచానికి నిమిత్తం లేదని తెలుసుకుంటే మంచిదన్నాడు. ఇతరుల పట్ల దయ, రామణీయకతను ఆస్వాదించడం ఆహ్వానించదగిన లక్షణాలుగా పేర్కొన్నాడు. సానుభూతి, సహకారం ఉత్తమ మానవ లక్షణాలుగా చూపాడు. శాస్త్రీయ, హేతుబద్ధ ధోరణిలో సంస్థల్ని మలచుకోవాలన్నాడు. మత సంస్థల్ని నమ్ముకొని వెనక్కు నడచే ధోరణి మానుకోవాలన్నాడు. సత్యం, సుందరం అనే లక్షణాలు -అలవరచుకుంటే- మనిషికి మార్గం చూపించే రీతులుగా అభిప్రాయ పడ్డాడు. రాజకీయ సంస్థలలో కూడా హేతుబద్ధత వుండాలని రస్సెల్, మానవుల సుఖ శాంతులకు అవి దోహదం చేయాలని కోరాడు. యుద్ధాల్ని, అణ్వాయుధ ప్రయోగాన్ని తీవ్రంగా వ్యతిరేకించాడు. నియంతృత్వాన్ని నిరసించాడు. స్వేచ్ఛను అన్ని విధాలా ప్రోత్సహించాలన్నాడు. ఇందుకు విద్య దోహదం చేయాలని సూచించాడు. మూఢ నమ్మకాలు పోగొట్టుకోవాలన్నాడు.

రస్సెల్ మామూలు జనానికి తెలియడానికి తాత్వికేతర విషయాలు కారణం కాగా, తాత్విక రంగంలో ఆయన కీర్తి అటు గణితంలోనూ యిటు తర్కంలోనూ వున్నది. 20వ శతాబ్దంలో రస్సెల్ గణిత తార్కిక తత్వాలలో మలుపు తిప్పాడనవచ్చు. ఆధునిక విజ్ఞానం ఆధారంగా తత్వాన్ని పెంపొందించిన రస్సెల్ కీర్తి చాలా వరకు నిలుస్తుంది. యూరోప్‌లో తత్వవేత్తలు, తార్కిక, గణిత శాస్త్రజ్ఞుల నుండి నేర్చుకోడానికి, వారికి కృతజ్ఞత చెప్పడానికి, అవసరమైన చోట విభేదించి, ఖండించడానికి రస్సెల్ వెనుకాడలేదు.

తత్వవేత్త లెబ్నిజ్ నిశిత పరిశీలనతో ఆరంభించిన రస్సెల్, తత్వమంతా ప్రతిపాదనల విశ్లేషణతో మొదలు కావాలన్నాడు. తత్వవేత్త నైతికంగా తటస్థ వైఖరి అవలంబించాలని, నిష్పక్షంగా వుండాలని రస్సెల్ తన మిస్టిసిజం అండ్ లాజిక్‌లో రాశాడు. ది ప్రిన్సిపల్స్ ఆఫ్ మాథమాటిక్స్ 1903లో రస్సెల్ రాసిన తరువాత బ్రిటిష్ తత్వంలో పెద్ద మార్పు కనిపించింది. తర్కం ద్వారా గణితాన్ని నిర్మించి రస్సెల్, వైట్‌హెడ్ పెద్ద విప్లవం తెచ్చారు. జర్మనీలో గణిత శాస్త్రజ్ఞుడు మైనాంగ్ (Meinong) ప్రభావం, పియర్స్ (Peirce), పియానో (Peano), ఫ్రెజీ (Frege) లను అధ్యయనం చేసి, వారి గణితాల లోతుపాతుల్ని రస్సెల్ చవిచూచాడు. పరస్పర విరుద్ధాలను కనుగొన్న రస్సెల్ ఆ

విషయాన్ని ఫ్రెజీకి రాశాడు. అది గమనించి ఫ్రెజి అదిరిపోయాడు. ఏమిటా విరుద్ధత్వం? ఉదాహరణకు రసెల్ యిలా పేర్కొన్నాడు:

నేను అబద్ధమాడుతున్నానని ఒకతను అన్నాడనుకోండి. అతడు అబద్ధమాడడం నిజమైతే, అంటే అతడు చెప్పేది నిజం కాకపోతే, అతడు అబద్ధమాడుతున్నాడన్న మాట. అంటే అతడు చెప్పేదానిలో నిజం వున్నదన్న మాట. ఈ విరుద్ధత్వాలు మాటల గారడీ వలె అగుపించినా, అలాగని విరుద్ధత్వాలను కొట్టి పారేయడానికి వీల్లేదని రస్సెల్ ఉద్దేశం. తర్కంలో ఇలాంటి విరుద్ధత్వాలు కుదరవు. దీనిని పరిష్కరించడానికి రస్సెల్ ప్రయత్నించి కొత్త సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టాడు. టైప్స్ (Types) సిద్ధాంతంగా అది వాడుకలోకి వచ్చింది. కాని రస్సెల్ తృప్తి పడలేదు.

తాత్విక సమస్యల్ని దీర్ఘంగా చర్చించిన రస్సెల్, దైనందిన నమ్మకాల్ని విమర్శిస్తూ, విజ్ఞానాన్ని సమర్థించి, తార్కిక గణిత పద్ధతిని అనుసరించాడు. మనకు ప్రత్యక్ష సంబంధం గల మానసిక స్థితి, ఇంద్రియ గోచర విషయాలు విడివిడిగా స్వీకరించి పరిశీలించ వచ్చునన్నాడు. విశ్వజనీన సూత్రాలు మనకు తెలుసు. విడి వస్తువుల వర్ణన తెలుసు. మన అనుభవం ఆధారంగా వచ్చిన జ్ఞానం, కచ్చితమైనదని చెప్పలేం, కాదనీ అనలేం అనే ధోరణి రస్సెల్ తన హ్యూమన్ నాలెడ్జ్, ఇట్స్ స్కోప్ అండ్ లిమిట్స్‌లో కనబరచాడు. ఇంద్రియ జ్ఞానం వ్యక్తిపరమైనది కాదనీ, అది మానసిక స్థితి అనజాలమనీ రస్సెల్ ఉద్దేశం. ఊహించి రాబట్టే బదులు, తార్కిక నిర్మాణం మేలు అంటాడు. వాస్తవాలనేవి ఇది తెలుపు అనే నిర్దుష్టమైన విషయంగానూ, మనుషులంతా చనిపోతారనే విశ్వజనీన విషయంగానూ రెండు విధాల వుంటాయని రస్సెల్ వర్గీకరించాడు. ప్రతిపాదలనేవి వాస్తవాలు కావచ్చు, దోషాలు కావచ్చు. అవి సంకేతాలు. తటస్థ ఏక పదార్థ వాదానికి దారి తీసిన రస్సెల్, మానసిక, భౌతిక వాదాలకు భిన్నంగా ఎనాలసిస్ ఆఫ్ మైండ్ , ఎనాలసిస్ ఆఫ్ మాటర్ రాశాడు. వాస్తవమనేది అటు పదార్థానికీ, ఇటు మానసిక రీతికీ మధ్య వున్నదనీ, ఆ తటస్థ ఏకరీతి నుండి యివి రెండూ రాబట్టాలంటాడు. దీనిని న్యూట్రల్ మోనిజం (Neutral Monism) అన్నాడు.

రస్సెల్ నిర్దుష్ట వర్ణన (చిత్రణ) థీరీ ఆఫ్ డెఫినెట్ డిస్క్రిప్షన్ అనే తత్వం 1950 వరకూ తిరుగు లేనిదిగా చలామణి అయింది. పీటర్ స్ట్రాసన్ (Peter Strawson) 1950లో మైండ్ పత్రికలో యీ సిద్ధాంతాన్ని తీవ్రంగా దుయ్యబడుతూ "ఆన్ రిఫరింగ్" అనే శీర్షికతో వ్యాసం రాశాడు. అప్పటి నుండీ రస్సెల్ సిద్ధాంతం యథాస్థితికి రాలేదు. స్ట్రాసన్‌కు 7 సంవత్సరాల తరువాత రస్సెల్ సమాధానం యిచ్చి, తన భేదాభిప్రాయాన్ని వివరించినా, అది పేలవంగానే మిగిలిపోయింది. స్ట్రాసన్ తన విమర్శలో రస్సెల్ గొప్పతనాన్ని అంగీకరిస్తూ, గణిత శాస్త్రాన్ని తర్కం ఆధారంగా స్థిరంగా, నిర్దుష్టంగా వుంచడానికి ప్రయత్నం చేసిన మహానుభావుడుగా జోహార్లు అర్పించాడు. రసెల్ గొప్ప భవనశిల్పి అనీ తాను తాపీపని వాడననీ స్ట్రాసన్ వినయంగా పోల్చుకున్నాడు.

సాధారణ భాషలో వుండే ప్రతిపాదనలకు భిన్నంగా రస్సెల్ ఆదర్శ భాషను సృష్టించి, నిర్దుష్ట చిత్రణ సిద్ధాంతాన్ని పేర్కొన్నాడు. ఆక్స్‌ఫర్డ్‌లో చదివిన స్ట్రాసన్ తన రచనల ద్వారా రస్సెల్‌ను విమర్శించి, భాషకూ వాస్తవాలకూ గల సంబంధాలను చూపాడు. రస్సెల్ తన తాత్వికాభివృద్ధిని మై ఫిలసాఫికల్ డెవలప్‌మెంట్ అనే గ్రంథం ద్వారా వివరించాడు. భాషకు స్వతంత్ర ప్రతిపత్తి లేదన్నాడు. భాషకు అర్థం వుంటుంది. భాషేతర విషయాలకు చెందిన వాటిని వివరిస్తుంది. సాధారణంగా మాట్లాడే భాషలో అనేక అస్పష్ట విషయాలు దొర్లుతుంటాయి. నిర్దుష్టత వుండదు. కచ్చితంగా పేర్కొనడానికి వాక్య నిర్మాణంలో, భాషలో మార్పులు అవసరమని రస్సెల్ ఉద్దేశం. మనం మాట్లాడే భాషకూ, పదార్థ విజ్ఞానం, వైద్య జ్ఞానం, రసాయనిక శాస్త్రం చెప్పే భాషకూ తేడా వుంది గదా. అలాగే తత్వం చెప్పడానికే భాష కావాలన్నాడు. గ్రీక్ తత్వవేత్త థేల్స్ నుండి తత్వంతో ప్రపంచాన్ని అవగాహన

చేసుకునే ప్రయత్నం సాగింది. వాళ్ళు విఫలమైనా, ఉత్తరోత్తరా వచ్చే వారికి ప్రోత్సాహం కల్పించే రీతులు అందించారు. ఆక్స్‌ఫర్డ్ తత్వం అలాంటి వాటికి తిలోదకాలిచ్చిందని రస్సెల్ విమర్శించాడు. విజ్ఞానంలో ఆసక్తి లేని తాత్వికుడు ప్రపంచాన్ని గురించి ఏమీ అవగాహన చేసుకోలేడని రస్సెల్ చెప్పాడు. దీనికి సాధారణ భాష చాలదని, తాత్వికులు సిద్ధాంతాలను పెంపొందించి, భాష ద్వారా వివరణ యివ్వడం తప్పనిసరి అన్నాడు. విజ్ఞాన శాస్త్రాలకు మన అనుభవాలకూ సంబంధం కల్పించి చూచే ప్రయత్నం చేశాడు రస్సెల్. మన అనుభవం అనగానే ఇంద్రియ గోచరాలు, అనుభూతులు, వూహా చిత్రణలు, జ్ఞాపకాలన్నీ యిమిడి వుంటాయి. వీటి మధ్య సంబంధం ఏర్పరచే తత్వం కోసం రస్సెల్ అన్వేషణ సాగింది. ఇందుకుగాను కొన్ని సిద్ధాంతాలు పెంపొందించాడు. తత్వం మాత్రమే యీ పని చేయగలదన్నాడు.

రస్సెల్ తన జీవితాన్ని క్షుణ్ణంగా వివరంగా రాసుకున్నాడు. అందులో కూడా నిర్దుష్టంగా జ్ఞానం మనకు వున్నదనీ, దానితో ఆరంభించి ముందుకు సాగాలన్నాడు. అలా పోతుండగా అనేక సందేహాలు ఎదుర్కొన్నాడు. వాస్తవాన్ని నిర్దుష్టంగా పేర్కొనడంతో తన వైఫల్యాన్ని రస్సెల్ అంగీకరించాడు. ముందుగా గణితంతో శ్రీకారం చుట్టి, నిర్దుష్టత అక్కడ వున్నదనుకొని, ముందుకు పోతుంటే, ఎదురు రాళ్ళు తగిలాయి. రస్సెల్‌కు ముందు గణితానికి సరైన తత్వం లేదు. ''ది ప్రిన్సిపల్స్ ఆఫ్ మేథమేటిక్స్'' ద్వారా 1900 లోనే రస్సెల్స్ తొలిసారిగా అలాంటి తత్వాన్ని సమకూర్చాడు. ఇది రస్సెల్‌కు పెద్ద తాత్విక ఘనతను సమకూర్చి పెట్టింది. వాస్తవ సంఖ్యల్ని నిర్వచించి, స్పష్టత సమకూర్చి, రేఖా గణితానికి సిద్ధాంతం యిచ్చి, మెకానిక్స్‌కు కొత్త పంథాను చూపాడు. చిరకాలంగా అపరిష్కృతంగా వున్న అనేక సమస్యల్ని రస్సెల్ విడమరచి గొప్పతనాన్ని ఆపాదించుకోగలిగాడు. ఆ తరువాత వైరుధ్యాలు ఎదురు కాగా రస్సెల్ ఆగిపోయి, నిరుత్సాహపడి, తరువాత గణితాన్ని వదలేశాడు.

శాంతి కాముకుడుగా రస్సెల్ మొదటి ప్రపంచ యుద్ధాన్ని వ్యతిరేకించాడు. అలాగే ద్వితీయ ప్రపంచ యుద్ధాన్ని నిరసించాడు. అణ్వస్త్రాలకు వ్యతిరేకంగా సత్యాగ్రహం చేశాడు. ప్రపంచ వ్యాప్తంగా పర్యటించాడు. రష్యా, చైనా, అమెరికా, ఇండియా వంటి చోట్ల అనేక అనుభవాలు గడించాడు. తన సిద్ధాంతాలు ఆచరించడానికి వీలుగా స్కూలు పెట్టి, చదువులు నేర్పాడు. విద్యలో శాస్త్రీయ పద్ధతులకై కృషిచేశాడు. క్రైస్తవాన్ని తీవ్రంగా నిరసించి, తానెందుకు క్రైస్తవుడిని కాదో, రాశాడు. ఐన్‌స్టీన్ సాపేక్షతా సిద్ధాంతంవల్ల ప్రభావితుడయ్యాడు. అధికారాన్ని అన్ని కోణాలనుండి పరిశీలించి, వివరించి, అందలి ప్రమాదాలను హెచ్చరించాడు.

20వ శతాబ్దం రస్సెల్‌దే అన్నంతగా ఆయన ప్రభావం వ్యాపించింది.

రస్సెల్‌ను గురించి సింహావలోకనం చేస్తే చూస్తే ఇప్పుడు కొంత పాతబడినట్లనిపిస్తుంది. చారిత్రకంగా 20వ శతాబ్దం మొదట్లో తాత్విక గణిత - తార్కిక రంగాలలో మలుపు తిప్పిన రస్సెల్ పాత్ర, మొదటి ప్రపంచ యుద్ధం దగ్గరే ఆగిపోయింది.

తాత్విక రంగంలో రస్సెల్ రచనలు పేర్కొన దగినవి:

ది ఫిలాసఫి ఆఫ్ లెబ్నిజ్ (1900). ది ప్రిన్సిపల్స్ ఆఫ్ మేథమాటిక్స్ (1903). ప్రిన్సిపియా మేథమెటికా (వైట్‌హెడ్ తో) (1910-13). ది ప్రాబ్లమ్స్ ఆఫ్ ఫిలాసఫి (1912). అవర్ నాలెడ్జ్ ఆఫ్ ఎక్స్‌టర్నల్ వరల్డ్ (1914). ది ఎనాలిసిస్ ఆఫ్ మైండ్ (1921). ది ఎనాలిసిస్ ఆఫ్ మేటర్ (1927). ఏన్ ఎంక్వైరీ ఇన్ టు మీనింగ్ అండ్ ట్రూత్ (1940). హ్యూమన్ నాలెడ్జ్; ఇట్స్

స్కోప్ అండ్ లిమిట్స్ (1948). లాజిక్ అండ్ నాలెడ్జ్ (1956). మై ఫిలసాఫికల్ డెవలప్‌మెంట్ (1958).

రస్సెల్ దృష్టిలో గణితానికి యవ్వనం ప్రసాదించినది తర్కం కాగా, తర్కానికి వ్యక్తిత్వాన్ని తెచ్చిపెట్టింది గణితం. ప్లేటో చెప్పిన, గాలిలో తేలిపోయే విశ్వజనీన భావనలు గాక, కచ్చితంగా నిర్దుష్టంగా వుండే వాటిని తర్కం, గణితం ద్వారా చర్చించి, తెలుసుకోవచ్చునని రస్సెల్ ఉద్దేశం.

సంప్రదాయ సిద్ధంగా వస్తున్న ప్రాపంచిక అనుభవవాద విషయాలను రస్సెల్ చర్చించి, భౌతిక వస్తువుల సమస్యలు పరిష్కరించే ప్రయత్నం చేశాడు. మనస్సు అనేది విషయ సముదాయంగా చూచిన రస్సెల్ తటస్థ ఏక వాదానికి దారితీశాడు. అందులో నుంచి మనస్సు, సదార్థం రాబట్టారన్నాడు. భాషాపరంగా ప్రపంచాన్ని అవగాహన చేసుకునే తీరుతెన్నులు విడమరచి చెప్పాడు. సమూలంగా చూస్తే బహుళవాదం వున్నట్లు, అనుభవం ద్వారా వాస్తవాలను వెల్లడించడానికి భాష తోడ్పడుతున్నట్లు రస్సెల్ పేర్కొన్నాడు. దేవుడున్నాడని గాని, మనిషి శాశ్వతంగా ఆత్మద్వారా వుంటాడని గాని నమ్మడానికి ఆధారాలు లేవన్నాడు. హేతుబద్ధంగా మతవిశ్వాసాలను ఎక్కడా సమర్థించ జాలం అన్నాడు. పైగా మానవాభివృద్ధికి మతం అడుగడుగునా అడ్డొస్తున్న దన్నాడు. మానవుడి సంక్షేమానికి మతం పెద్ద అవరోధంగా రస్సెల్ భావించాడు.

రస్సెల్ తన తత్వంలో నిర్ధారితమైన సత్యాన్వేషణ, కచ్చితమైన ప్రతిపాదనలకై ప్రయత్నించాడు. తర్కం, గణితంలో ప్రాతిపదికలు వాస్తవాలుగా వుండాలన్నాడు. కాని అలాంటి కచ్చితమైన రీతులు తర్కం ద్వారా రాలేదు. కనుక రస్సెల్ సందేహవాదం పెంపొందించక తప్పలేదు.

మనం నమ్మే వాటిని సమర్థించు కోవాలంటే గుడ్డిగా గాక, శాస్త్రీయ పద్ధతులలోనే సాగిపోవాల న్నాడు. రస్సెల్ మానవ సంక్షేమం కోరిన తాత్వికుడు. ★

## FITNOTES

### MILKY SEDATIVES

**According to Indian mythology, a saint in the ancient days invented sleep to lessen a woman's pain at the loss of her husband. A sound sleep, scientists have long discovered, is a very good thing. Apart from muffling the intensity of hatred anger and pain of a human being, it also rejuvenates his body.**

**Hence the partial or complete inability to sleep soundly, or insomnia, can be very harmful to both body and mind. The principal cause of this disability is said to be the depression resulting from daily stress. But, according to the recent discovery of two psychiatrists Joyce and Anthony Coles of Penn State University, tension apart, insomnia may well be caused by some abnormal habits of people. The principal ones among them are, straining one's body severely during the day, doing some dubious sleep-inducing exercise just before going to bed, regular use of sleeping pills and continuous grumbling about one's 'dog's life'.**

**These abnormal behaviour patterns force the biological clock in the body to go awry. So, instead of sending an electro-magnetic message to the body cells to sleep at night, the misinformed biological clock may transmit the message to stay awake instead. For such people, Joyce and Anthony have two simple tips. They are advised not to oversleep on their weekly days off and to have a glass of hot milk before going to bed. Milk contains Sorotonin, an amino acid, which is a natural sedative and helps the brain to transmit sleep-commencing messages to the cells.**

Printed, Published and Edited by ALAPATI RAVINDRANATH at Kala Jyothi Process Pvt. Ltd., 1-1-60/5, Iftekar Mansion Lane, R.T.C. X Roads, Musheerabad, Hyd-20. Ph. 612436, 612337.

Editorial NEST


Plot No. 337 A, Road No. 10, Jubilee Hills, Hyderabad-500 034. Ph. 247717



‘‘చచ్చినవారు అదృష్టవంతు’’లని అసూయపడే సోమాలియా ప్రజలు.

MISIMI/ మిసిమి RNI Regd No.45042/90 Telugu Monthly Hyderabad-500 02

Postal Regd. No.H/SD/191




"ఆడమ్ అండ్ ఈవ్"

(ఫాగ్ ఆర్ట్ మ్యూజియం, హార్వర్డ్)